Follow: @ANNTELUGU

16-01-2025

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 45 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## సుప్రీంకోర్టు తీర్పు కేటీఆర్‌కు చెంపపెట్టు



- కుంభకోణం.. లబంకోణం లేదన్నారు
- ప్రజలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి
- తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

02

## కేజ్రీవాల్ నామినేషన్



- పాదయాత్రగా వెళ్ళి పత్రాల అందజేత
- సతీసమేతంగా హనుమాన్ మందిర్‌లో ప్రార్థనలు

02

## కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనికి సుప్రీంకోర్టు బిగ్ షాక్



- ఎన్నిక రద్దు?
- వాదనలు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్న ధర్మాసనం

05



## మార్మోగుతోన్న ప్రయాగ్‌రాజ్

### కుంభమేళాలో జనసంద్రం

మహా కుంభమేళా జనహోరుతో మార్మోగుతోంది.. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ భక్త జనసంద్రాన్ని తలపిస్తోంది. మూడో రోజు కూడా లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు.. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. నదీమతల్లికి హారతులు ఇచ్చిన మొక్కులు తీర్చుకుంటున్నారు. భక్తుల భజనలతో హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో ప్రయాగ్‌రాజ్ మార్మోగుతోంది. భారీగా తరలివస్తున్న భక్తులతో త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ కొనసాగుతోంది. భక్తుల భజనలు, హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో ప్రయాగ్‌రాజ్ లో భక్తి వెల్లివిరుస్తోంది.



## మళ్ళీ లిక్కర్ కేసు ప్రకంపనలు

- కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు ఈడీకి గ్రీన్ సిగ్నల్
- త్వరలో అరెస్ట్ ఖాయమన్న ప్రచారం
- కవితకు మళ్ళీ జైలుకు పోతుందంటున్న ఎంపీ


02



## నెరవేరిన ఇందూరు రైతుల కల

- పసుపు బోర్డును సాధించిన అరవింద్
- వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి పీయూష్
- ప్రధాని మోదీ మాట ఇస్తే నెరవేరుస్తారు

02




## మహేష్ బాబు రివ్యూ వచ్చేసింది

- బ్లాక్ బస్టర్ పొంగల్
- సంక్రాంతికి వస్తున్నాం పండుగ సినిమా

03

### దేశ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి

# పోర్టుల ఊతం




**ఉపాధి అవకాశాలు విస్తృతం.. నౌకాదళంతో దేశం శక్తివంతం**

**యుద్ధనౌకలను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ**

**మహా:** దేశ నౌకాదళం ఇక మరింత శక్తిమంతమైంది. సముద్ర జలాల్లో గస్తీని పెంచడం, ఎలాంటి సంక్లిష్ట పరిస్థితులనైనా ధీటుగా ఎదుర్కొనేలా రూపుదిద్దుకుంటోంది. చైనా దక్షిణ సముద్ర తీర ప్రాంతం నుంచి ముప్పు పొంచివున్న ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత శక్తిమంతమైన మూడు యుద్ధనౌకలు బరిలోకి దిగాయి. ఈ మూడింటినీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం జాతికి అంకితం చేశారు.

మిగతా 2లో

# దేశంలో రెండే భావజాలాలు



### కాంగ్రెస్ భావజాలం వర్సెస్ ఆర్ఎస్ఎస్ భావజాలం

- బ్రిటీష్ మీద భారతీయులు చేసిన పోరాటాన్ని ఆర్ఎస్ఎస్ గుర్తించడం లేదు
- రామ్ లల్లా ప్రతిష్టాపన దేశ స్వాతంత్ర్యదినంగా జరుపుకోవాలా?
- అది దేశ ద్రోహ వ్యాఖ్యలే.. మరో దేశంలో అయితే ఆయనను అరెస్ట్ చేసే వారు కాంగ్రెస్ భావజాలానికి ప్రతీకగా నూతన భవనం
- కాంగ్రెస్ కార్యకర్తల రక్తంతో నూతన భవనం నిర్మించాం
- ఏఐసీసీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- ఇందిరాభవన్ ప్రారంభ వేడుకకు సోనియా, ఖర్గే, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్, మహేష్

వివరాలు 4లో

# బీఆర్ఎస్ కాదు..

# బీ ఆర్ఎస్ఎస్

### ఢిల్లీలో సీఎం రేవంత్ సెటైర్..!



## బీజేపీ, బీఆర్ఎస్‌లది ఒకే వైఖరి

### దేశప్రజల ప్రయోజనానికి కాంగ్రెస్ కార్యాలయం వేదిక

### నిన్నగాక మొన్న వచ్చిన పార్టీలకు కూడా కార్యాలయాలున్నాయ్

**ఢిల్లీ, మహా :** బీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ఎస్ గా మారిందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ వైఖరి బీజేపీ వైఖరి తెలంగాణలో ఒకే రకంగా ఉందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో వెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పై బీజేపీ ఏ ఆరోపణలు చేస్తే తెలంగాణలో కాంగ్రెస్ పై బీఆర్ఎస్ అవే ఆరోపణలు చేస్తుందని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణలో చట్టబద్ధమైన పాలన కొనసాగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిపై ప్రస్తావిస్తూ ఘటనకు ముందు జరిగిన పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. గతంలో తలుపులు బద్దలు కొట్టి ఇళ్ళల్లోకి పోలీసులను పంపించి అక్రమంగా అరెస్టులు చేయించినపుడు సక్రమ పాలన ఎలా అవుతుందని ప్రశ్నించారు. పోలీసులు తమ పని తాము చేస్తున్నారన్నారు. ఇందులో ప్రభుత్వ జోక్యం ఏమీ లేదన్నారు. గత ప్రభుత్వంలో ఫని చేసిన పోలీసులే ప్రస్తుత ప్రభుత్వంలో పని చేస్తున్నారని, కొత్త వారెవరూ లేరన్నారు. బీజేపీ కనుసన్నల్లోనే బీఆర్ఎస్ పని చేస్తుందని, కాంగ్రెస్ పై కేంద్రంలోని బీజేపీ ఏ ఆరోపణ చేస్తుందో అదే తరహా ఆరోపణను రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్నారన్నారు.

మిగతా 3లో

# కేటీఆర్‌కు సుప్రీం షాక్

### క్వాష్ పిటీషన్ ఉపసంహరణ

**హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన ధర్మాసనం**

**నేడు ఈడి ముందుకు కేటీఆర్**



**హైదరాబాద్, మహా :** ఫార్ములా ఈ రేస్ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బిగ్ షాక్ తగలింది. హైకోర్టు ఆదేశాల్లో తాము ఎలాంటి జోక్యం చేసుకోబోమని తేల్చి చేప్పేసింది. దీంతో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ ఏ1 నిందితుడిగా ఉండగా, గురువారం ఈడి విచారణ జరపనుంది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కేటీఆర్ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా బుధవారం బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లె నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.

మిగతా 2లో

### మహాకుంభ మేళాకు వెళ్లి వస్తుండగా


# తెలంగాణ బస్సు దగ్ధం

**ఒకరు సజీవ దహనం.. మధుర సమీపంలో ఘోర ప్రమాదం**

- నిర్మల్ కు చెందిన యాత్రికులు
- స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులు

03

కార్టూ'నిజం'




# ప్రవేశ పరీక్షల తేదీలు

## ప్రకటించిన ఉన్నత విద్యా మండలి

**ఏప్రిల్ 29న ఈఏపి సెట్.. మే 2 నుండి ఇంజనీరింగ్ ఈఏపీ సెట్**

**హైదరాబాద్, మహా:** ఈఏపీసెట్ , ఇంజినీరింగ్ ఈఏపీసెట్, ఈసెట్, ఎడ్‌సెట్ తో పాటు అన్ని ప్రవేశపరీక్షల తేదీలు ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. పక్కా ప్లానింగ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏప్రిల్ 29 నుంచి ఈఏపీసెట్

ఏప్రిల్ 29, 30 తేదీల్లో ఈఏపీసెట్ (అగ్రికల్చర్, ఫార్మసీ)

మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ఈఏపీసెట్

మే 12న ఈసెట్, జూన్ 1న ఎడ్‌సెట్

జూన్ 6న లాసెట్, పీజీ లా సెట్




జూన్ 8,9 తేదీల్లో ఐసెట్

జూన్ 16 నుంచి 19 వరకు పీజీఈసెట్



# మీ ఆవేదన ఆక్రోషం దేని కోసం

### మీ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

ఎంపీ ధర్మపురి అరవింద్‌పై తుమ్మల భగ్గు

బహిరంగ లేఖ విడుదల

03



# బీఆర్ఎస్ అంటే భూస్థాపితమయ్యే సమితి

### తుమ్మల నాగేశ్వరరావు ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదు

మంత్రి తుమ్మల లేఖ రాస్తే ఇది రాలే..దమ్ముంటే చక్కర ఫ్యాక్టరీ తెరిపించాలి

ఎంపీ ధర్మపురి అరవింద్ విసుర్లు..కేసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకున్నారు

కవిత జైలుకెళ్ళింది.. కేటీఆర్ త్వరలో జైలుకెళ్తారు

2019 నుండి నన్ను టార్గెట్ చేశారు

అయినా మోదీజీ సహకారంతో పసుపుబోర్డు సాధించా

03

# బీఆర్ఎస్ కాదు.. బీ ఆర్ఎస్ఎస్



(మొదటిపేజీ తరువాయి)
బీజేపీ తరహాలోనే ఆర్ఎస్ఎస్ మార్గదర్శనలో బీఆర్ఎస్ పని చేస్తుంది, బీజేపీ, బీఆర్ఎస్ లకు తేడా ఏం లేదన్నారు. 140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ సొంత కార్యాలయం నిర్మించుకునేందుకు ఇన్నేళ్లు పట్టిందని తెలిపారు. నిన్న గాక మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలు, 40 ఏళ్ల సీనియారిటీ మాత్రమే ఉన్న బీజేపీ స్వల్పకాలంలోనే కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయన్నారు. తమ పార్టీ ప్రజల కోసం ఎంత నిస్వార్థంగా పని చేస్తుందో దీనిని బట్టి అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీ ఇతర ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు, కాంగ్రెస్ పార్టీ ఆర్థిక స్థితి గతి ఎలా ఉందో గమనించాలన్నారు. అవసరమైన నిర్ణయాలు, ప్రణాళికలు రచించబడతాయన్నారు సీఎం రేవంత్ రెడ్డి. దేశ భవిష్యత్తు కోసం ఇకపై ఈ కార్యాలయం వేదికగా ప్రణాళికలు రచించబోతున్నామని జోస్యం చెప్పారు. ప్రపంచంలోనే మేటి దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దేందుకు విధివిధానాలు రూపొందిస్తామన్నారు. దేశ ప్రజలకు ఇది పండగ రోజు అని ఆయన అభివర్ణించారు. దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ ఈ రోజు అద్భుతమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందని తెలిపారు. దేశ ప్రజల ప్రయోజనానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక వేదిక కాబోతుందన్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు పలువురు కేంద్ర మంత్రుల అపాయింట్ మెంట్ కోరామన్నారు. అపాయింట్‌మెంట్ వచ్చిన వెంటనే వారిని కలిసి తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

## మహాకుంభ మేళాకు వెళ్లి వస్తుండగా
# తెలంగాణ బస్సు దగ్ధం

**ఒకరు సజీవ దహనం.. మధుర సమీపంలో ఘోర ప్రమాదం**
**నిర్మల్ కు చెందిన యాత్రికులు.. స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులు**



**మహా :** ఉత్తరప్రదేశ్ విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లాకు చెందిన యాత్రికులు ఉత్తరప్రదేశ్‌కు విహారయాత్రకు వెళ్లారు. ప్రమాదావశాత్తు వారు ప్రయాణిస్తున్న బస్సు మంటల్లో చిక్కుకొని దగ్ధమైంది. అందులో ఒకరు సజీవదహనమయ్యారు. మిగతా వారిని స్వస్థలాలకు చేర్చేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం బృందావన్‌లోని టూరిస్ట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఫైర్ సేఫ్టీ సిస్టమ్‌తో మంటలను అదుపు చేసినా, అప్పటికి బస్సు పూర్తిగా దగ్ధమైంది. నిర్మల్ జిల్లాకు చెందిన భక్తులతో మహాకుంభస్నానం చేసి బస్సు తిరిగి వస్తున్నట్లు సమాచారం. యాత్రికులను భైంసా రప్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ చొరవ చూపారు. అక్కడి కలెక్టర్, ఎస్పీతో మాట్లాడారు. యాత్రికులను క్షేమంగా తరలించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన బృందావన్ అధికారులు. ప్రత్యేక వాహనాల ద్వారా యాత్రికులను స్వస్థలాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్ బృందావన్‌లో బస్సు దగ్ధమైంది. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది యాత్రికులు ఉన్నారు. అయితే ఈ ఘటనలో నిజామాబాద్ జిల్లా కుబీర్ మండలం పల్సీకి చెందిన శీలం ద్రుపత్ ప్రమాదంలో సజీవ దహనమయ్యారు. మిగిలిన యాత్రికులంతా సురక్షితంగా బయటపడ్డారు. కాగా, బస్సు, యాత్రికుల సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. ప్రస్తుతం యాత్రికులు యూపీ పోలీసుశాఖ, ఆర్ఎస్ఎస్ సంరక్షణలో ఉన్నారు. ఇదిలావుండగా, బస్సులో బీడీలు కాల్చడమే అగ్నిప్రమాదానికి కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. వంట కోసం గ్యాస్ సిలిండర్లను బస్సులో ఉంచడంతో మంటలు భారీ రూపం దాల్చాయి. మంటలు చెలరేగడంతో ప్రయాణికులు అద్దాలు పగులగొట్టి ప్రాణాలు కాపాడుకున్నారు. నిర్మల్ జిల్లా నుంచి 50 మంది భక్తులతో బస్సు బృందావనం చేరుకుంది. ఈ బస్సు మధ్యాహ్నం 2:30 గంటలకు టూరిస్ట్ ఫెసిలిటేషన్ సెంటర్‌కు చేరుకుంది. భక్తులు ఆలయ దర్శనానికి వెళ్లారు. కాగా, సాయంత్రం 5:30 గంటలకు బస్సులో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది బస్సులో మంటలను ఆర్పివేయడంతో ఈ ప్రయాణికుడి గురించిన సమాచారం వెలుగులోకి వచ్చింది. బస్సులోపల చూసేసరికి ఓ భక్తుడి అస్థిపంజరం కనిపించింది. అనారోగ్యం కారణంగా ద్రుపదుడు తోటి యాత్రికులతో ఆలయానికి వెళ్లలేకపోయాడు. వెనుక సీటులో కూర్చుని బీడీ తాగుతున్నాడు. ఇంతలో ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగడంతో వారిని బయటకు తీసేందుకు కూడా అవకాశం లేకపోయింది. ఆ తర్వాత అతని అస్థిపంజరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ సింగ్ ఇతర అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు, అగ్నిమాపక శాఖలు సమగ్ర విచారణలో నిమగ్నమై ఉన్నాయి. బాధిత ప్రయాణికులకు అన్ని విధాలా సాయం చేస్తామని స్థానిక యంత్రాంగం హామీ ఇచ్చింది. ఈ ఘటనపై అధికారులు సంబంధిత వర్గాలకు సమాచారం అందించారు.

# కేటీఆర్‌కు సుప్రీం షాక్





(మొదటిపేజీ తరువాయి)
ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని చెప్పింది. విచారణ ప్రాథమిక దశలోనే ఉందని సుప్రీం అభిప్రాయపడింది. ప్రత్నామ్నాయ మార్గాలు మీకు ఉన్నాయి కదా అని కేటీఆర్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ దవేని ప్రశ్నించింది. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని స్పష్టం చేసింది. దీంతో వెనక్కి తగ్గిన కేటీఆర్ తరపు న్యాయవాది తామే పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని ధర్మాసనానికి తెలిపారు.

**హాట్ హాట్ గా వాదనలు**

పిటిషన్ విచారణ సందర్భంగా హాట్ హాట్ గా వాదనలు జరిగాయి. రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని కేటీఆర్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ దవే కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం కేటీఆర్ విపక్షంలో ఉన్నారని సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే రాజకీయ కక్షలో భాగంగా కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది కేటీఆర్ తరపు న్యాయవాదిని ప్రశ్నించారు. ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ ఈ కేసులో అవినీతి జరిగిందని, అందుకు సంబంధించిన ఆధారాలు ఏసీబీ వద్ద ఉన్నాయని చెప్పారు. పూర్తి స్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఇప్పటికే కేటీఆర్ విచారణకు హాజరయ్యారని, కేసు విచారణ దశలో ఉన్న నేపథ్యంలో క్వాష్ చేయటం సరైన నిర్ణయం కాదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. అయితే పిటిషన్ వెనక్కి తీసుకుని, మళ్ళీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించేందుకు తమకు అవకాశం ఇవ్వాలని కేటీఆర్ తరపు న్యాయవాది సుప్రీం ధర్మాసనాన్ని కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన సుప్రీం ధర్మాసనం, మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛను మాత్రం ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకుంటామని కేటీఆర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కాగా, కేటీఆర్ ఈడీ విచారణను ఎదుర్కొనున్నారు. ఇప్పటికే ఆయన్ను ఏసీబీ ఓ దఫా విచారించగా.. గురవారం ఈడీ విచారణకు హాజరు కానున్నారు.

# మళ్ళీ లిక్కర్ కేసు ప్రకంపనలు

**కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు ఈడీకి గ్రీన్ సిగ్నల్**
**త్వరలో అరెస్ట్ ఖాయమన్న ప్రచారం.. కవితకు మళ్ళీ జైలుకు పోతుందంటున్న ఎంపీ**



**ఢిల్లీ, మహా:** ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కీలక పరిణామం జరిగింది. ఈ వ్యవహారంలో అరవింద్ కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఈడీకి కేంద్ర హోంశాఖ అనుమతి మంజూరు చేసింది. ఢిల్లీలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో గత సంవత్సరమే కేజ్రీవాల్‌పై ఈడీ ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. దాని ప్రాతిపదికన కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు అనుమతి కావాలని కేంద్ర హోంశాఖను ఈడీ అభ్యర్థించింది. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్న వేళ కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు ఈడీకి అనుమతి మంజూరు కావడం గమనార్హం.

**ప్రధాన సూత్రధారి ఆయనే**

202122లో జరిగిన ఢిల్లీ లిక్కర్ స్కాంలో ప్రధాన సూత్రధారి కేజ్రీవాలే అని ఈడీ వాదిస్తోంది. ఈ స్కాం ద్వారా వచ్చిన నిధులను ఆప్ పార్టీ కార్యకలాపాల కోసం ఆయన వాడుకున్నారని అంటోంది. మనీలాండరింగ్ ద్వారా వచ్చిన నిధులను ఒక కంపెనీలా ఆప్ పార్టీ వాడుకుందని గతంలో ఈడీ ఆరోపించింది. కేజ్రీవాల్ సీఎంగా వ్యవహరించిన సమయంలో మంత్రులుగా ఉన్న పలువురి ఆప్ సీనియర్ నేతల పేర్లను కూడా ఈ స్కాం కేసులో ఈడీ పొందుపరిచింది. తొలుత లిక్కర్ స్కాంపై సీబీఐ విచారణకు కేంద్ర ప్రభుత్వానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సిఫార్సు చేశారు. తదుపరిగా ఈడీ కూడా మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద 2022 ఆగస్టు 22న కేసును నమోదు చేసింది. 2022 ఆగస్టు 17న సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ప్రాతిపదికగా తీసుకొని ఈడీ దర్యాప్తును మొదలుపెట్టింది.

**కవిత మళ్ళీ జైలుకు**

గతంలో లిక్కర్ కేసులో దాదాపు ఐదుమాసాలు జైలులో ఉండొచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవిత మళ్ళీ జైలుకు పోవడం ఖాయమని పసుపుబోర్డు ప్రారంభోత్సవం సందర్భంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. మరుసటి రోజే కేంద్ర హోంశాఖ ఈడి విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేజ్రీవాల్ విచారణకు అనుమతించినా సిరీస్ లో భాగంగా.. మళ్ళీ కవితకు అరెస్ట్ ముప్పు ఉందన్న సంకేతాలు తాజా పరిణామాలను బట్టి కనిపిస్తున్నాయి.

# దేశ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి పోర్టుల ఊతం

**ఉపాధి అవకాశాలు విస్తృతం.. నౌకాదళంతో దేశం శక్తివంతం**
**యుద్ధనౌకలను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ**





(మొదటిపేజీ తరువాయి)
ముంబైలోని నావల్ డాక్ యార్డ్ వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటైంది. ఇందులో పాల్గొనడానికి ఈ ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ముంబైకి చేరుకున్నారాయన. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత నౌకాదళాధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని, ఈ క్రమంలో రక్షణ మంత్రిత్వ శాఖను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశ మ్యానుఫ్యాక్చరింగ్, ఎక్స్‌పోర్ట్స్ సామర్థ్యం రెట్టింపు అవుతోందని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో వందలాది కొత్త నౌకలు, కొత్త కంటైనర్లు అవసరమౌతాయని మోదీ పేర్కొన్నారు. వాటిని తయారు చేసుకునే క్రమంలో దేశవ్యాప్తంగా గల అన్ని పోర్టులు కూడా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఊతమివ్వబోతోన్నాయని అన్నారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని అన్నారు. జనావాసాలకు దూరంగా ఉంటూ వస్తోన్న దీవులను కూడా అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యతను ఇస్తోన్నామని మోదీ చెప్పారు. సముద్రాలపై సమగ్రంగా అధ్యయనం చేయడానికి సముద్రయాన్ ప్రాజెక్ట్‌ను చేపట్టిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీనివల్ల సముద్ర గర్భంలో 6,000 అడుగుల లోతున చోటు చేసుకునే పరిణామాలపై అధ్యయనం చేయవచ్చని చెప్పారు.



# కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనికి సుప్రీంకోర్టు బిగ్ షాక్

**మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కు సుప్రీం కోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. తనపై దాఖలైన ఎన్నికల అఫిడవిట్ పిటిషన్ ను రద్దుచేయాలని ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే.. సుప్రీంకోర్టు కూనంనేని పిటిషన్ ను డిస్మిస్ చేసింది. ఎన్నికల అఫిడవిట్ కేసులో వాదనలు ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యే కూనంనేని సిద్ధంగా ఉండాలని స్పష్టం చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఫార్మ్ 26 ఎన్నికల అఫిడవిట్ లో సమగ్ర వివరాలు వెల్లడించలేదని కొత్తగూడెంకు చెందిన నందూలాల్ అగర్వాల్ ఆరోపించారు. ఈ క్రమంలో ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారికి సమర్పించిన ఫార్మ్ 26 అఫిడవిట్ లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కూనంనేని తన భార్య పేరును పేర్కొనలేద పిటిషన్ లో వెల్లడించాడు. ఇంకా లైసెన్స్‌డ్ నోటరీతో అఫిడవిట్ చేయించలేదని ఎన్నికల పిటిషన్ లో పేర్కొన్నారు.

# దేశంలో రెండే భావజాలాలు

**కాంగ్రెస్ భావజాలం వర్సెస్ ఆర్ఎస్ఎస్ భావజాలం**
**బ్రిటీష్ మీద భారతీయులు చేసిన పోరాటాన్ని ఆర్ ఎస్ ఎస్ గుర్తించడం లేదు**
**రామ్ లల్లా ప్రతిష్టాపన దేశ స్వాతంత్ర్యదినంగా జరుపుకోవాలా?**
**అది దేశ ద్రోహ వ్యాఖ్యలే.. మరో దేశంలో అయితే ఆయనను అరెస్ట్ చేసే వారు**
**కాంగ్రెస్ భావజాలానికి ప్రతీకగా నూతన భవనం..కాంగ్రెస్ కార్యకర్తల రక్తంతో నూతన భవనం నిర్మించాం**
**ఎఐసిసి నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**
**ఇందిరాభవన్ ప్రారంభ వేడుకకు సోనియా, ఖర్గే, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్, మహేష్**




**ఢిల్లీ , మహా:** దేశంలో రెండే భావజాలాలు ఉన్నాయని, కాంగ్రెస్ భావజాలంలో పెద్ద, చిన్న కులాలు, తర తమ బేధాలు ఉండవని, రాజ్యాంగంలో అదే రాసి ఉందని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్‌లో పూర్తిగా కేంద్రీకృతమైన విధానాలు, నిర్ణయాలు ఉంటాయన్నారు. రాజ్యాంగం చెల్లుబాటు కాదని మోహన్ భగవత్ చెబుతున్నారని, బ్రిటీష్ మీద జరిగిన పోరాటాన్ని గుర్తించడం లేదని ఆర్ఎస్ఎస్ తీరును విమర్శించారు. కొత్త ఢిల్లీలోని కోట్లా రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆరు అంతస్థుల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ కాంగ్రెస్ నేత సోనియా గాంధీ నేడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఈ కార్యాలయ భవనానికి ఇందిర భవన్ గా నామకరణం చేశారు. అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్టాపనను స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకోవాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు వస్తాయన్నారు. మరో దేశం అయితే ఆయన్ను అరెస్టు చేసేవారని ఆరోపించారు. ఆ కేసులో భగవత్‌ను విచారించేవారన్నారు.

**రాజ్యాంగ విలువలపై వారికి నమ్మకం లేదు**

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ... ఆర్ఎస్ఎస్ విధానాలు పాటిస్తున్న బీజేపీకి త్రివర్ణ పతాకంపై గౌరవం లేదని, రాజ్యాంగ విలువలపై నమ్మకం లేదన్నారు. రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీయేనని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ భావజాలం ఇవాళ్టిదో.. నిన్నటిదో కాదని.. వేల సంవత్సరాల ఆర్ఎస్ఎస్ ఐడియాలజీని వ్యతిరేకిస్తూ వేల ఏళ్లుగా మా ఐడియాలజీ కొనసాగుతూ వచ్చిందన్నారు. రునానక్, గౌతమ బుద్ధుడు, కృష్ణుడు.. వీళ్లంతా ఆర్ఎస్ఎస్ ఐడియాలజీనా.. అని ప్రశ్నించారు. ఈ కొత్త భవనం కాంగ్రెస్ భావజాలానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ భవనంలో ఉన్న అందరూ ఆ భావజాలాన్ని కాపాడేవారేనని బీజేపీకి లొంగిపోయేవారు కాదని అన్నారు. ఈ భవంతి బయట మిలియన్ల కొద్దీ ప్రజలు మన భావజాలానికి మద్దతుగా ఉన్నారని, ఈ భావజాలం దేశం నలుమూలలకు మరింతగా విస్తరించాలని రాహుల్ గాంధీ పిలుపిచ్చారు. ఈ కొత్త కార్యాలయం కాంగ్రెస్ కార్యకర్తల రక్తంతో నిర్మించామని, ఇందులో ప్రతిఒక్క కాంగ్రెస్ వాదికి భాగం ఉందని రాహుల్ అన్నారు.

# కేజ్రీవాల్ నామినేషన్

**పాదయాత్రగా వెళ్ళి పత్రాల అందజేత**
**సతీసమేతంగా హనుమాన్ మందిర్‌లో ప్రార్థనలు**

**ఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 'ఆప్' జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారంనాడు నామినేషన్ వేశారు. ఆప్ పనితీరుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కేజ్రీవాల్ తన భార్య, పార్టీ కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా రిటర్నింగ్ అధికారి కార్యాలయాని వెళ్లి నామినేషన్ పత్రాలు అందజేశారు. దీనికి ముందు కన్నాట్ ప్లేస్‌లోని ప్రాచీన హనుమాన్ మందిరంలో సతీసమేతంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పర్వేష్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థిగా సందీప్ దీక్షిత్ పోటీ పడుతున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు
# కేటీఆర్‌కు చెంపపెట్టు

**కుంభకోణం.. లబంకోణం లేదన్నారు**
**ప్రజలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి.. తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**హైదరాబాద్, మహా:** సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చెంపపెట్టని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ము దోచుకున్న కేటీఆర్.. కుంభకోణం లేదు లంబకోణం లేదని అన్నారని శ్రీనివాస్ మండిపడ్డారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన వాళ్లపై చర్యలు తీసుకుంటే అక్రమ కేసులు అంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేసిన వారిని ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని ప్రభుత్వ విప్ తేల్చి చెప్పారు. ఇందుకు కోర్టులూ ప్రభుత్వానికి సహకరించడం సంతోషంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లాగా ఇళ్ల తలుపులు విరగొట్టి మరీ అరెస్టులు చేయడం లేదని ఆయన విమర్శించారు.

# నెరవేరిన ఇందూరు రైతుల కల

## పసుపు బోర్డును సాధించిన అరవింద్

### వర్చువల్ గా ప్రారంభించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్.. ప్రధాని మోదీ మాట ఇస్తే నెరవేరుస్తారు



**ఢిల్లీ, మహా:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణకు పసుపు బోర్డు ఇస్తానని చెప్పారని.. ఆహామీని నిలబెట్టుకున్నారని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డును మంగళవారం కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బండి సంజయ్, ఎంపీ అర్వింద్ పాల్గొన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను శాలువా, పసుపు కొమ్ముల దండతో ఎంపీ అరవింద్ సత్కరించారు. సంక్రాంతి రోజు పసుపు రైతుల కలను నెరవేర్చిన నరేంద్ర మోదీకి పాదాభివందనం చేస్తున్నానని ఎంపీ అరవింద్ అన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్, కేంద్రమంత్రి బండి సంజయ్ కోరిక మేరకు సంక్రాంతి రోజున ప్రారంభిస్తున్నామని అన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, మేఘాలయ సహా 20 రాష్ట్రాల్లో పసుపు పంట పండించే రైతుల కోసం ప్రధాని మోదీ ఒక బహుమతిగా ఈ నిర్ణయం తీసుకున్నారని ఉద్ఘాటించారు.

**పసుపును బంగారంతో పోల్చుతాం..**

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ ధర్మపురి అరవింద్, కేంద్రమంత్రి బండి సంజయ్ కోరిక మేరకు సంక్రాంతి రోజున పసుపు బోర్డు ప్రారంభిస్తున్నామని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, మేఘాలయ సహా 20 రాష్ట్రాల్లో పసుపు పంట పండించే రైతుల కోసం ప్రధాని మోదీ ఒక బహుమతిగా ఈ నిర్ణయం తీసుకున్నారని ఉద్ఘాటించారు. మోదీ ఏదైనా చెప్పారంటే అది నెరవేరితీరుతుందని అన్నారు. కాశ్మీర్‌లో టన్నెల్ అయినా, రైతులకు ఇచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలైనా, స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సహకలైనా ఏదైనా సరే.. మాట ఇచ్చారంటే అమలు చేసి తీరుతారని ప్రశంసించారు. ప్రపంచంలోని 19 దేశాలు ప్రధాని మోదీని సర్వోన్నత పౌరపురస్కారాలతో సత్కరించాయని.. ఇది మామూలు విషయం కాదని గుర్తుచేశారు.పసుపు పంటను వ్యవసాయంలో బంగారంతో పోల్చుతామని... అలాంటి పంట సాగు కోసం ఈ బోర్డు ఎంతో ఉపయోగరంగా ఉంటుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

# దేశప్రజల ప్రయోజనానికి కాంగ్రెస్ కార్యాలయం వేదిక

## నిన్నగాక మొన్న వచ్చిన పార్టీలకు కూడా కార్యాలయాలున్నాయ్

### దేశ భవిష్యత్తు కోసం ఇక్కడి నుండే దిశానిర్దేశం

### ఏఐసీసీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

### బీఆర్ఎస్ కాదు బీ ఆర్ఎస్ఎస్.. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒకే వైఖరితో ఉన్నాయని విమర్శ

**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్ పార్టీకి 140 ఏళ్ల చరిత్ర ఉందని.. ఆ పార్టీ ఏ స్వార్థం లేకుండా దేశం కోసం పని చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అంత ఘన చరిత్ర ఉన్న ఈ పార్టీ దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమంతోపాటు అభివృద్ధి కోసం పాటు పడిందని ఆయన గుర్తు చేశారు. ఇన్నేళ్లు దేశాన్ని నడిపిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోందన్నారు. బుధవారం న్యూఢిల్లీలో ఏఐసీసీ నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ అగ్రనేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. నిన్న కాకుండా మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలతో పాటు బీజేపీ సైతం పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని గుర్తు చేశారు. అలాగే ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు కోసం ఇకపై ఈ కార్యాలయం వేదికగా ప్రణాళికలు రచించబోతున్నామని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో పేద ప్రజలందరికీ ఇక్కడి నుంచే దశ దిశ నిర్ధారిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోనే మేటి దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దేందుకు విధి విధానాలు రూపొందిస్తామన్నారు. దేశ ప్రజలకు ఇది పండగ రోజు అని ఆయన అభివర్ణించారు. దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ ఈ రోజు అద్భుతమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందని తెలిపారు. దేశ ప్రజల ప్రయోజనానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక వేదిక కాబోతుందన్నారు.



**విపక్షాలపై విమర్శలు**

బీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ఎస్ గా మారిందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ వైఖరి బీజేపీ వైఖరి తెలంగాణలో ఒకే రకంగా ఉందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో వెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పై బీజేపీ ఏ ఆరోపణలు చేస్తే తెలంగాణలో కాంగ్రెస్ పై బీఆర్ఎస్ అవే ఆరోపణలు చేస్తుందని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణలో చట్టబద్ధమైన పాలన కొనసాగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిపై ప్రస్తావిస్తూ ఘటనకు ముందు జరిగిన పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. గతంలో తలుపులు బద్దలు కొట్టి ఇళ్ళల్లోకి పోలీసులను పంపించి అక్రమంగా అరెస్టులు చేయించినపుడు సక్రమ పాలన ఎలా అవుతుందని ప్రశ్నించారు. పోలీసులు తమ పని తాము చేస్తున్నారన్నారు. ఇందులో ప్రభుత్వ జోక్యం ఏమీ లేదన్నారు. గత ప్రభుత్వంలో పని చేసిన పోలీసులే ప్రస్తుత ప్రభుత్వంలో పని చేస్తున్నారని, కొత్త వారెవరూ లేరన్నారు. బీజేపీ కనుసన్నల్లోనే బీఆర్ఎస్ పని చేస్తుందని, కాంగ్రెస్ పై కేంద్రంలోని బీజేపీ ఏ ఆరోపణ చేస్తుందో అదే తరహా ఆరోపణను రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్నారన్నారు. బీజేపీ తరహాలోనే ఆర్ఎస్ఎస్ మార్గదర్శనలో బీఆర్ఎస్ పని చేస్తుంది, బీజేపీ, బీఆర్ఎస్ లకు తేడా ఏం లేదన్నారు.

# బీఆర్ఎస్ అంటే భూస్థాపితమయ్యే సమితి

## తుమ్మల నాగేశ్వరరావు ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదు

### మంత్రి తుమ్మల లేఖ రాస్తే ఇది రాలే.. దమ్ముంటే చక్కర ఫ్యాక్టరీ తెరిపించాలి

### ఎంపీ ధర్మపురి అరవింద్ విసుర్లు.. కేసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకున్నారు

### కవిత జైలుకెళ్ళింది.. కేటీఆర్ త్వరలో జైలుకెళ్తారు.. 2019 నుండి నన్ను టార్గెట్ చేశారు

### అయినా మోదీజీ సహకారంతో పసుపుబోర్డు సాధించా



**ఢిల్లీ, మహా:** సంక్రాంతి పండగ రోజు తెలంగాణ రైతాంగానికి పసుపు బోర్డును ప్రధాని నరేంద్ర మోడీ బహుమతిగా ఇచ్చారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే ఏదో సాధించామని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో పడుకున్నారని ఆయన ఆగ్రహించారు. బీఆర్ఎస్ పాలనలో అనేక రంగాలు కుంటుపడిపోయాయని అరవింద్ విమర్శించారు. పదేళ్లలో కరెంటు అదనంగా ఉత్పత్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కవిత ఇప్పటికే జైలుకు వెళ్లి వచ్చారని, ఇప్పుడు కేటీఆర్ సైతం జైలుకు వెళ్తారని ఎంపీ జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడడం అనవసరమని, ఆ పార్టీ త్వరలో భూస్థాపితం అవుతుందని ఆయన చెప్పుకొచ్చారు. వ్యవసాయశాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదంటూ ఎంపీ చురకలు అంటించారు. దమ్ముంటే తుమ్మల చెరకు ఫ్యాక్టరీలు తెరిపించాలని సవాల్ చేశారు. మంత్రి తుమ్మల లేఖలు రాస్తే పసుపు బోర్డు రాలేదని ఎంపీ ధర్మపురి చెప్పుకొచ్చారు.


**మోదీ జీ.. ధన్యవాదాలు..**

పసుపు బోర్డు ఏర్పాటులో ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పాత్ర ఎంతో ఉందని ఎంపీ ధర్మపురి తెలిపారు. నిజామాబాద్‌కి పసుపు బోర్డు తీసుకొస్తాననే పూర్తి నమ్మకం తనకు ఉండేదని చెప్పారు. అదే నమ్మకంతో కష్టపడి పని చేసినట్లు చెప్పుకొచ్చారు. తన ప్రయత్నాలు ఫలించి సంక్రాంతి పండగ రోజు బోర్డును రైతన్నలకు ప్రధాని మోదీ బహుమతిగా ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు నేపథ్యంలో ఎన్నో రాజకీయాలు జరిగాయని, 2019 నుంచి ఇప్పటివరకూ తనను ఎలా టార్గెట్ చేశారో తెలంగాణ ప్రజలందరికీ తెలుసని ఆయన చెప్పుకొచ్చారు. గుండాలను పంపించి తన ఇళ్లపై దాడి చేశారని, అయినా తాను మాత్రం తలొగ్గలేదని అన్నారు. తెలంగాణ బీజేపీ నేతల కృషి ఫలితంగానే 33 ఏళ్ల తర్వాత దేశంలో పసుపు బోర్డు ఏర్పాటు అయ్యిందని ఎంపీ అరవింద్ చెప్పారు. పసుపు బోర్డు ఛైర్మన్‌గా పల్లె గంగారెడ్డి ఎంపికయ్యారని, తన రాజకీయ ఎదుగుదలలో ఆయన పాత్ర ఎంతో ఉందని అరవింద్ తెలిపారు. పల్లె గంగారెడ్డిది రైతు కుటుంబమని, దీని వల్ల అన్నదాతల కష్టాలు ఆయనకు బాగా తెలుస్తాయని చెప్పారు. దీని వల్ల వారికి మరింత లబ్ధి చేకూరే అవకాశం ఉంటుందని ఎంపీ చెప్పుకొచ్చారు. పల్లె గంగారెడ్డి కష్టజీవని పసుపు రైతుల ఆదాయం రెట్టింపు చేసే చర్యలు ఆయన చేపడతారని అరవింద్ చెప్పుకొచ్చారు. పసుపు బోర్డు రావడంతో ఆయనపై మరింత బాధ్యత పెరిగిందని ఎంపీ అరవింద్ చెప్పారు.

**ఈ బోర్డుతో అందరికీ లాభం**

పసుపు బోర్డు వల్ల కేవలం పసుపు రైతులకే ఉపయోగం ఉంటుందని కొంతమంది భావిస్తున్నారని, కానీ దాని వల్ల అందరికీ లాభం ఉంటుందని ఎంపీ అరవింద్ చెప్పారు. మరిన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చుకుంటే పసుపు మాత్రమే కాకుండా ఇతర పరిశ్రమలు సైతం వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. నిజామాబాద్‌లో అల్లం, పసుపు, కూరగాయలు అనేక పంటలు పండుతాయని ఆ రైతలకూ లబ్ధి చేకూరే అవకాశం ఉందని చెప్పారు. అలాగే నిజామాబాద్ ప్రాంతంలో బీడీ కార్మికులు ఎక్కువగా ఉన్నారని, ప్రస్తుతం వారి జీవనోపాధి తక్కువగా ఉందని చెప్పుకొచ్చారు. పసుపు బోర్డుతో వారికీ ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. నిజామాబాద్ ప్రజలకు లిక్కర్ వద్దు పసుపు బోర్డు ముద్దంటూ ఆయన స్లోగన్ చెప్పారు. తాను రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చానని, భవిష్యత్తులో మరిన్ని హామీలు నెరవేరుస్తానని చెప్పుకొచ్చారు. నిజామాబాద్‌లో 10 రైల్వే ఆర్వోబీలు నిర్మించాలని, ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చుకుంటూ తాను ముందుకెళ్తానని ఎంపీ అరవింద్ చెప్పారు.

# క్రికెట్ బిజినెస్‌లోకి సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్



**మహా:** ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ లండన్‌కు చెందిన క్రికెట్ జట్టు కోసం వేలం వేసే సిలికాన్ వ్యాలీ ఎగ్జిక్యూటివ్‌ల కన్సార్షియంలో చేరారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్ వంటి టాప్ టెక్ లీడర్లతో కూడిన ఆ గ్రూప్ ఓవల్ ఇన్విన్సిబుల్స్ లేదా లండన్ స్పిరిట్ జట్టు కోసం 80 మిలియన్ పౌండ్ల (దాదాపు 97 మిలియన్ డాలర్లు రూ.805.1 కోట్లు) బిడ్ వేయనుంది. సుందర్ పిచాయ్ చేరిన గ్రూప్నకు పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సీఈఓ నికేష్ అరోరా, టైమ్స్ ఇంటర్నెట్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్ సత్యన్ గజ్వానీ నేతృత్వం వహిస్తున్నారు. యువ క్రికెట్ అభిమానులను ఆకర్షించడానికి రూపొందించిన క్రికెట్ టోర్నమెంట్ 'ది హండ్రెడ్' ఎనిమిది జట్లు ప్రైవేట్ పెట్టుబడులను పొందడానికి ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) చేసిన ప్రయత్నంలో భాగంగా బిడ్ దాఖలవుతున్నట్లు తెలుస్తోంది. 100బాల్ ఫార్మాట్‌ను అనుసరించే ది హండ్రెడ్ లీగ్ 2021లో ప్రారంభమైంది. అధిక సంఖ్యలో ప్రేక్షకులను ఆకర్షించడంలో విజయవంతమైంది. లీగ్లో ఎనిమిది జట్లు పాల్గొంటుండగా, ప్రతి ఒక్కటి యూకేలోని ఒక ప్రధాన నగరానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. అలా ఇప్పుడు ఓవల్ ఇన్విన్సిబుల్స్ లేదా లండన్ స్పిరిట్ జట్టు కోసం బిడ్ వేసే గ్రూప్లో సుందర్ పిచాయ్ చేరారు.

## సుందర్‌కు క్రికెట్ పట్ల ఆసక్తి

**అయితే సుందర్‌కు క్రికెట్ పట్ల ఎంతో ఆసక్తి ఉంది. ఎప్పటికప్పుడు అందుకు సంబంధించిన విషయాలపై స్పందిస్తుంటారు. వివిధ టోర్నీల్లో విజేత ఎవరనే విషయంపై జోస్యం చెబుతుంటారు. ఇటీవల టీమ్ ఇండియా పేసుగుర్రం జస్ప్రీత్ బుమ్రాపై ప్రశంసలు కురిపించి వార్తల్లో నిలిచారు. ఆస్ట్రేలియా, భారత్ మధ్య గబ్బా వేదికగా జరిగిన టెస్టో బంతితో అదరగొట్టిన బుమ్రా, తన బ్యాటింగ్ గురించి తెలుసుకోవాలంటే గూగుల్‌లో వెతకండంటూ వ్యాఖ్యానించాడు. దీంతో సుందర్ పిచాయ్ స్పందించారు. తాను గూగుల్ చేశానని అన్నారు. కమిన్స్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టినవారికి బ్యాటింగ్ ఎలా చేయాలో చాలా బాగా తెలుసని చెప్పారు. భారత్‌కు ఫాలో ఆన్ గండాన్ని తప్పించాడంటూ ప్రశంసించారు.**


# మహేష్ బాబు రివ్యూ వచ్చేసింది

## బ్లాక్ బస్టర్ పొంగల్

### సంక్రాంతికి వస్తున్నాం.. పండుగ సినిమా



**మహా:** సినిమాలకు మహేష్ బాబు చూసి ఇచ్చే రివ్యూ వేరే లెవెల్. సినిమా నచ్చితే చాలు.. స్టార్లతో సంబంధం లేకుండా నచ్చితే రివ్యూ చెప్పేస్తారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా.. లేట్‌గా వచ్చిన లేటెస్ట్‌గా కలెక్షన్లను రాబడుతోంది. మొదటి ఆట నుండే ఈ సినిమాకు పాజిటివ్ స్పందన రావడంతో.. సంక్రాంతి వైబ్ మొత్తం ఈ సినిమానే ఆక్రమించేసింది. ముఖ్యంగా పాటలు ఈ సినిమాకు పెద్ద ఎస్సెట్‌గా నిలిచాయి. సినిమా విడుదలకు ముందే పాటలు సినిమాను ప్రేక్షకులలోకి తీసుకెళ్లాయి. దీంతో విజయం సునాయాసమైంది. దీనిపై సూపర్ స్టార్ మహేష్ బాబు రివ్యూ ఇచ్చేశారు. ''పండగకి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా చూసి ఎంతో ఎంజాయ్ చేశాను. ఇది పర్ఫెక్ట్ పండగ సినిమా. విక్టరీ వెంకటేష్‌గారు చాలా అద్భుతంగా నటించారు. వరుస బ్లాక్‌బస్టర్స్ ఇస్తున్న నా దర్శకుడు అనిల్ రావిపూడిని చూసి గర్వంగానూ, సంతోషంగానూ ఉంది. ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి వారి పాత్రలలో అద్భుతంగా చేశారు. బుల్లిరాజు అనే పిల్లాడు ఆద్యంతం నవ్వులు పూయించాడు. ఈ సినిమాకు పనిచేసిన నటీనటులు మరియు సాంకేతిక నిపుణులందరికీ అభినందనలు'' అని 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాపై మహేష్ బాబు స్పందించారు.



# హైదరాబాద్‌లో దేశంలోనే అతి పెద్ద మల్టీ లెవల్ కారు పార్కింగ్ కాంప్లెక్స్

## వచ్చే నెలలో అందుబాటులోకి నాంపల్లిలో మల్టీ లెవల్ కారు పార్కింగ్

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో కొత్తగా ఫ్లైఓవర్లు, రోడ్లు, అండర్‌పాసులు నిర్మించింది. తాజాగా రేవంత్ ప్రభుత్వం కూడా నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇక నగరంలో ప్రధాన సమస్య పార్కింగ్. మెయిన్ సిటీలో ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేవు. రోడ్లపై వాహనాలు నిలిపితే ట్రాఫిక్ జామ్‌తో పాటుగా.. పోలీసులు ఫైన్లు కూడా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం నాంపల్లి మెట్రో స్టేషన్ పక్కన మల్టీ లెవల్ కారు పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. త్వరలోనే ఈ కాంప్లెక్స్ అందుబాటులోకి రానుంది. అత్యాధునిక వసతులతో ఈ మల్టీ లెవల్ కారు కాంప్లెక్స్‌ను నిర్మించారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో సుమారు రూ.80 కోట్లు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. మెస్సర్స్ భారీ ఇన్ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రాజెక్టును నిర్మించింది. దేశంలోనే తొలిసారిగా జర్మన్ పాలిస్ పార్కింగ్ విధానంలో తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేసేలా ఆ కాంప్లెక్స్‌ను రూపొందించారు. నాంపల్లిలో అర ఎకరం స్థలంలో 15 అంతస్తులుగా ఈ భారీ నిర్మాణం చేపట్టారు. అందులో 10 అంతస్తుల్లో వెహికల్ పార్కింగ్‌కు కేటాయించగా.. మిగిలిన 5 అంతస్తుల్లో కమర్షియల్ షాపులు, రెండు స్క్రీన్లతో ఒక సినిమా థియేటర్ ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రదేశాల్లో 250 కార్లు, 200 బైకులు పార్క్ చేసే అవకాశం ఉంది. కరోనా తీవ్రత, డెట్ ఫైనాన్సింగ్ సమస్యలు, గ్లోబల్ సప్లయ్ చైన్ అంతరాయాల వల్ల ప్రాజెక్టు నిర్మాణం కాస్త ఆలస్యం అయినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ మల్టీ లెవల్ కారు పార్కింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి రానుండగా ఆ తర్వాత వాహనదారుల ఇబ్బందులు తీరనున్నాయి. కాగా, ఇటువంటి మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌లు నగరంలో మరిన్ని అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని నగర వాసులు అభిప్రాయపడుతున్నారు. నగరంలోని కీలకమైన జంక్షన్లు, మెట్రో స్టేషన్లు, వాణిజ్య కేంద్రాల్లో మరిన్ని పార్కింగ్ కాంప్లెక్స్‌లు అందుబాటులోకి వస్తే నగరవాసుల పార్కింగ్ సమస్యలు పూర్తిగా తీరిపోతాయి. ఈ కోణంలో గత కొంత కాలంగా ప్రభుత్వం ప్రయత్నాలను ప్రారంభించింది. గచ్చిబౌలీ, హైటెక్ సిటీతో పాటు సికింద్రాబాద్ లాంటి రద్దీ ప్రదేశాలలో ఇలాంటి మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణంపై దృష్టిసారించింది. ఇందుకు సంబంధించి పలు కంపనీలతో సంప్రదింపులను కూడా జరుపుతోంది.

# మీ ఆవేదన ఆక్రోషం దేని కోసం

**ఖమ్మం, మహా :** నా రాజకీయ జీవితం గురించి మీరు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం... ఆక్షేపణీయంగా ఉన్నాయంటూ ఎంపీ దర్మపురి అరవింద్ పై మంత్రి తుమ్మల భగ్గుమన్నారు. ఈ స్థాయికి దిగజారి మీరు మాట్లాడతారని తాను ఊహించలేదని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం పట్ల అవగాహన రాహిత్యమో, సమాచార లోపమో తెలియదు కానీ మీ వ్యాఖ్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కానివని స్పష్టం చేశారు. తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన తుమ్మల నాగేశ్వరరావు, తన 40 ఏళ్ల రాజకీయ జీవన ప్రయాణాన్ని వివరించారు. పదవుల కోసం ఎప్పుడూ ఎదుటివారి వద్ద మొక్కలేదని, ప్రజాసేవే తన ధ్యేయమని స్పష్టం చేశారు. నందమూరి తారక రామారావు నుండి రేవంత్ రెడ్డి వరకు నేతలతో పనిచేసినా ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి తప్ప మరేదీ తమ లక్ష్యం కాదని వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాలో కౌలాస్ నాలా, సింగీతం కల్యాణి, లక్ష్మీ కెనాల్, శారదా సాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులు తన మంత్రి పదవీకాలంలో పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పారిశ్రామిక ప్రాధాన్యం కలిగిన బోధన్ చక్కెర కర్మాగారం పునరుద్ధరణకు సంబంధించి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. పసుపు బోర్డు ఏర్పాటు సుదీర్ఘ సమరం ఫలితమని, ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపిన తన చర్యపై అరవింద్ విమర్శలు అనవసరమని పేర్కొన్నారు. ధర్మపురి అరవింద్ వినయంతో, రాజకీయ పరిజ్ఞానంతో వ్యవహరించాలని తుమ్మల నాగేశ్వరరావు హితవు పలికారు. వ్యక్తిగత వ్యాఖ్యలు చేయకుండా ప్రజాసేవను నిమిత్తంగా మాట్లాడితే మేలని సూచించారు. తన రాజకీయ జీవితం తెరచిన పుస్తకం లాంటిదని, ప్రతి అడుగులోనూ ప్రజల ప్రయోజనమే తన ధ్యేయమని తుమ్మల స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధికి తన సుదీర్ఘ ప్రయాణం తార్కాణమని పేర్కొన్నారు.

EDITORIAL ఎడిటోరియల్

# భారత్ చైనాలకు చమురు ప్రమాదం



భారత్ కు చమురు దెబ్బ తగులుతుందా? అమెరికా ఆడుతున్న ఆటలో చైనాను దెబ్బతీయాలనుకుంటే.. అది భారత్ కు కూడా ఎంతో కొంత నష్టం చేస్తుందా? తాజా పరిణామాలు ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. సుదీర్ఘంగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని అడ్డుకోవాల్సింది పోయి పెట్రోల్ పోసి మంట పెంచుతున్న అగ్రరాజ్యం.. ఇప్పుడు ఆ యుద్ధం విషయంలో తటస్థంగా ఉంటున్న దేశాల్ని కూడా వదిలిపెట్టడం లేదు. ఇందులో భాగంగా యుద్ధంలో రష్యాకు మద్దతుగా నిలుస్తున్న చమురు ఆదాయానికి గండి కొట్టేందుకు భారీ ఆంక్షలు విధించింది. దీని ప్రభావం ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన దేశాలైన భారత్, చైనాపై పడింది. రష్యాకు సహజ మిత్రులైన భారత్, చైనా గతంలో అమెరికా విధించిన ఆంక్షల్ని లెక్కచేయకుండా ఆ దేశం నుంచి చమురు కొన్నాయి. దీంతో తన అవసరాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని రష్యా వీరిద్దరికీ డిస్కౌంట్ పై భారీగా చమురు అమ్మింది. ఇదంతా చూస్తూ వస్తున్న అమెరికా తాజాగా రష్యా చమురు రిఫైనరీలు, ఆ చమురును రవాణా చేసే నౌకలు, వారి ఇన్సూరెన్స్ సంస్థలపై భారీ ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో భారత్, చైనాకు రష్యా చమురు సరఫరా నిలిచిపోతోంది. ఇన్నాళ్లూ రష్యా చమురు డిస్కౌంట్ పై వస్తుండటంతో మిగతా ప్రత్యామ్నాయాలపై పెద్దగా దృష్టిపెట్టని ఇరుదేశాలు ఇప్పుడు తప్పనిసరిగా ఆలోచనలో పడ్డాయి. ప్రత్యామ్నాయంగా తమకు చమురు సరఫరా చేసే మార్గాల కోసం అన్వేషిస్తున్నాయి. ఎలాగో అమెరికా కోపం రష్యాపైనే కాబట్టి ఇతర మార్గాల్లో చమురును తెచ్చుకోవాలని ఆలోచిస్తున్నాయి. ఈ ప్రభావం ధరలపై పడే అవకాశాలు కనిపిస్తోంది. గతంలో చమురు సరఫరా దేశాలైన గ్రూప్ ఆఫ్ సెవెన్ ఆంక్షలు, పరిమితుల వల్ల రష్యా నుంచి చమురు ఎగుమతులు రోజుకు 1.5 మిలియన్ బ్యారెల్స్ యూరప్ దేశాల నుంచి ఆసియాకు మళ్లించారు. అయితే అమెరికా తాజా ఆంక్షలు అమల్లోకి వచ్చినా 600 ట్యాంకర్ల రష్యా రహస్య నౌకల కారణంగా స్వల్పకాలిక ప్రభావాలను తగ్గించవచ్చని విశ్లేషకుల అంచనా . చైనా, రష్యా , సింగపూర్ సమీపంలో కనీసం 65 రష్యా ఆయిల్ ట్యాంకర్లు ఇప్పుడు చేరుకుని ఉన్నట్లు తెలుస్తోంది. 60 శాతం పైగా రష్యన్ సముద్రపు చమురును పొందుతున్న భారతీయ రిఫైనరీలు అమెరికా ఆంక్షలతో ఇప్పటికే ఆమోదం పొందిన సంస్థలతో సైతం తాత్కాలికంగా లావాదేవీలను నిలిపివేశాయి. అయితే వచ్చే రెండు నెలల కాలంలో మాత్రం నౌకల్ని అనుమతిస్తాయి. మరోవైపు రష్యా ఎగుమతులను కొనసాగించడానికి మరిన్ని డిస్కౌంట్ లు ఆఫర్ చేసే అవకాశముంది. భారతీయ రిఫైనరీలు ప్రత్యామ్నాయ ముడి చమురు కోసం ఒమన్ వంటి మధ్య ప్రాచ్య సరఫరాదారుల వైపు మొగ్గు చూపుతున్నాయి. అటు చైనా కూడా అబుదాబి, అంగోలా, బ్రెజిల్, కెనడా నుండి చమురు కొనుగోలు చేస్తోంది.

# కుంభమేళాలో అఖాడాల వైభవం

**మహా ప్రత్యేకం:**
అఖాడాలు లేకుండా కుంభమేళాను ఊహించుకోలేం. ఈ అఖాడాల సాధువుల వల్ల కుంభమేళా ఎంతో వైభవంగా జరుగుతుంది. ఈ అఖాడాలలో సాధారణ సాధువులతో పాటు నాగా సాధువులు కూడా ఉంటారు, వీరి తపస్సు చూసి ప్రజలు ఎంతో ఆశ్చర్యపోతారు. ప్రస్తుతం గుర్తింపు పొందిన అఖాడాల సంఖ్య 13. వీటిలో 7 శైవులవి, 3 వైష్ణవులవి, 3 సిక్కులవి. మహా కుంభమేళా వైభవంగా జరుగుతున్న వేళ ఈ 13 అఖాడాల ప్రాముఖ్యత, నేపథ్యమేంటో చూద్దాం.

**ఆనంద్ అఖాడా (శైవ)**
ఇది కూడా శైవుల అఖాడా. దీనిని మహారాష్ట్రలోని బరార్‌లో స్థాపించారు. ఈ అఖాడా సాధువులు సూర్యుడిని ఇష్టదైవంగా భావిస్తారు. ఈ అఖాడా సాధువులు కాశీ చుట్టుపక్కల ప్రాంతాలలో నివసిస్తారు. మొఘల్ కాలంలో జరిగిన యుద్ధాలలో ఆనంద్ అఖాడాకు చెందిన చాలా మంది సాధువులు ప్రాణాలు విడిచారు. ఈ అఖాడాలో సన్యాసం ఇచ్చే ప్రక్రియ చాలా కఠినంగా ఉంటుంది.

**అగ్ని అఖాడా (శైవ)**
అగ్ని అఖాడా చాలా పురాతనమైనది. దీని కేంద్రం గిర్నార్ కొండపై ఉంది. ఈ అఖాడా సాధువులు నర్మదా నది ఒడ్డున నివసిస్తారు. వీరి ఆరాధ్య దైవం గాయత్రీ దేవి. అగ్ని అఖాడాలో చతుష్మాన్ బ్రహ్మచారులను తయారు చేస్తారు, వారిని ఆనంద్, చైతన్య, ప్రకాష్, స్వరూప్ అనే పేర్లతో విభజిస్తారు. దేశవ్యాప్తంగా అగ్ని అఖాడాలో దాదాపు 4,000 మంది బ్రహ్మచారులు ఉన్నారు.

**మహానిర్వాణి అఖాడా (శైవ)**
ఇది కూడా శైవ అఖాడాలలో ప్రముఖ స్థానం కలిగి ఉంది. దీని కేంద్రం హిమాచల్ ప్రదేశ్‌లోని కన్ఖల్‌లో ఉంది. దీని ఇతర శాఖలు ఓంకారేశ్వర్, కాశీ, త్రయంబక్, కురుక్షేత్ర, ఉజ్జయినిలలో ఉన్నట్లు సమాచారం. ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయంలో కూడా ఈ అఖాడా సాధువులు మహంత్‌లుగా ఉంటారు. దీనిని ఎనిమిది మంది సాధువులు కలిసి స్థాపించారు. కపిల్ భగవాన్ వీరి ఇష్టదైవం. దీని ప్రారంభం బీహార్‌లోని హజారీబాగ్ జిల్లాలోని గద్కుండాలోని సిద్ధేశ్వర్ మహాదేవ్ ఆలయం నుండి అని నమ్ముతారు.

**ఆవాహన్ అఖాడా (శైవ)**
ఈ అఖాడా 547వ సంవత్సరంలో స్థాపించడం జరిగిందని సమాచారం. ఈ అఖాడా ప్రధాన కేంద్రం కాశీ సమీపంలో ఉంది. ధర్మాన్ని రక్షించడానికి ఈ అఖాడా స్థాపించినట్లు చెబుతుంటారు. ఈ అఖాడా సాధువులు కుంభమేళాలో రాజవస్త్రాలు ధరించి స్నానం చేస్తారు. ఈ అఖాడా ఇష్టదైవాలు గణేశుడు, దత్తాత్రేయుడు. ఇది జూనా అఖాడా ఉప అఖాడా. హరిద్వార్‌లో కూడా దీనికి శాఖ ఉంది. ప్రస్తుతం ఆవాహన్ అఖాడాలో 15,000 మంది సాధువులు ఉన్నారు. వీరిలో 12,000 మంది నాగా సాధువులు.

**నిరంజని అఖాడా (శైవ)**
ఇది శైవులలో అతిపెద్ద అఖాడా. ఈ అఖాడా 904వ సంవత్సరంలో గుజరాత్‌లోని మాండ్విలో స్థాపించడం జరిగిందని నమ్ముతారు. ఈ అఖాడా ఇష్టదైవం కార్తికేయుడు. నిరంజని అఖాడాలో 33 మంది మహామండలేశ్వరులు, 10,000 కంటే ఎక్కువ మంది నాగా సన్యాసులు ఉన్నారని అంటుంటారు. ఈ అఖాడాలో చాలా మంది చదువుకున్న సాధువులు ఉన్నారు, వారు ఉన్నత పదవులను వదులుకొని ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం.

**అటల్ అఖాడా (శైవ)**
అటల్ అఖాడా చరిత్ర చాలా పురాతనమైనది. దీనిని ఆది శంకరాచార్యులు స్థాపించినట్లు చెబుతుంటారు. దీని కేంద్రం కాశీలో ఉంది. ఈ అఖాడా ఇష్టదైవం గణేశుడు. మహాకుంభ్, కుంభమేళాలలో అటల్ అఖాడా పాత్ర ముఖ్యమైనది. అటల్ అంటే తన మార్గం నుండి ఎప్పుడూ తప్పుకోని, ధర్మ కార్యాలకు ముందుండేవాడని అర్థం.

**జూనా అఖాడా (శైవ)**
జూనా అఖాడా కూడా శైవులలో ప్రముఖ స్థానం కలిగి ఉంది. దీని పేరు ముందు భైరవ్ అఖాడాగా ఉండేది, తర్వాత జూనాగా మార్చడం జరిగింది. ఈ అఖాడా ఇష్టదైవం దత్తాత్రేయుడు. దీనిని 1145లో ఉత్తరాఖండ్‌లోని కర్ణప్రయాగలో స్థాపించారు. జూనా అఖాడా ప్రధాన కార్యాలయం వారణాసిలోని హనుమాన్ ఘాట్‌లో ఉంది. ఈ అఖాడాలో అవధూతలు (స్త్రీ సాధువులు) కూడా ఉంటారు.

**నిర్వాణి అఖాడా (వైష్ణవ)**
ఇది వైష్ణవుల రెండవ అఖాడా. దీనిని సన్యాసి అభయ్‌రామ్‌దాస్ స్థాపించారు. ఈ అఖాడా సాధువులకు నాలుగు విభాగాలు ఉంటాయి హరిద్వారి, వసంత, ఉజ్జయిని, సాగరియా. అయోధ్యలోని హనుమాన్‌గఢీపై ఈ అఖాడాకు అధికారం ఉంది. నిర్వాణి అఖాడా ప్రధాన స్థానాలు వృందావన్, చిత్రకూట్‌లలో కూడా ఉన్నట్లు సమాచారం.



**నిర్మోహి అఖాడా (వైష్ణవ)**
ఇది వైష్ణవుల మూడవ అఖాడా. నిర్మోహి అంటే మోహం లేనివాడు. ఈ అఖాడాను 1720 ఫిబ్రవరి 4న స్థాపించారని భావిస్తారు. దీని ప్రధాన స్థానం వారణాసి. ఈ అఖాడా శ్రీరాముడిని పూజిస్తుంది. ఈ అఖాడా సాధువులు శాస్త్రాలతో పాటు ఆయుధాల ప్రయోగంలో కూడా నిష్ణాతులు.

**దిగంబర్ అఖాడా (వైష్ణవ)**
ఇది వైష్ణవుల పురాతన అఖాడా. దీనిని అయోధ్యలో స్థాపించారు. ఈ అఖాడా సాధువులు ఎల్లప్పుడూ తెల్లని వస్త్రాలు వేసుకుంటారు, ఉర్ధ్వపుండ్ర తిలకం పెట్టుకుంటారు. వారు విష్ణువు అవతారాలైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడిని పూజిస్తారు. దీని జెండాపై హనుమాన్ చిత్రం ఉంటుంది. దేశవ్యాప్తంగా వీరికి 450 కంటే ఎక్కువ మఠాలు, ఆలయాలు ఉన్నట్లు సమాచారం. వైష్ణవ అఖాడాలలో అత్యున్నత పదవి శ్రీమహంత్.


**కొత్త ఉదాసీన్ అఖాడా (సిక్కు)**
ఉదాసీన్ సాధువుల మధ్య విభేదాలు రావడంతో మహాత్మా సూరదాస్ ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. దానికి ఉదాసీన్ పంచాయతీ కొత్త అఖాడా అని పేరు పెట్టారు. ఈ అఖాడాను 1913 జూన్ 6న నమోదు చేశారు. దీని ప్రధాన కేంద్రం హరిద్వార్‌లోని కన్ఖల్‌లో ఉంది.

**కిన్నెర అఖాడా**
ఈ అఖాడా 2015 నుండి ఉనికిలోకి వచ్చింది. దీనిని కిన్నెర కార్యకర్త డాక్టర్ లక్ష్మీ నారాయణ్ త్రిపాఠి ఏర్పాటు చేశారు. కిన్నెరలు తమ ప్రత్యేక అఖాడాను స్థాపించినప్పుడు అఖిల భారత అఖాడా పరిషత్ దీనిని వ్యతిరేకించింది.

**నిర్మల్ అఖాడా (సిక్కు)**
ఇది సిక్కుల అఖాడా. దీనిని 1862లో బాబా మెహతాబ్ సింగ్ స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయం హరిద్వార్‌లోని కన్ఖల్‌లో ఉంది. ఈ అఖాడాలో ప్రతిరోజూ ఉదయం 4 గంటలకు గురు గ్రంథ్ సాహిబ్ పారాయణం నిర్వహిస్తారు. ఈ అఖాడా సాధువులు ఎలాంటి మత్తు పదార్థాలు సేవించారు. ఎవరైనా తీసుకుంటే వారిని అఖాడా నుండి బహిష్కరిస్తారు. ఈ అఖాడా సాధువులు తెల్లని వస్త్రాలు ధరిస్తారు.

**పెద్ద ఉదాసీన్ అఖాడా (సిక్కు)**
శ్రీ పంచాయితీ అఖాడా పెద్ద ఉదాసీన్ చరిత్ర చాలా పురాతనమైనది. దీనిని నానాషాహి అఖాడా అని కూడా అంటారు. దీనిని 1825లో హరిద్వార్‌లోని కన్ఖల్‌లో స్థాపించారు. ఈ అఖాడా ప్రధాన ఆశ్రమం ప్రయాగరాజ్‌లో ఉంది. ఈ అఖాడాలో నాగా సాధువులు ఉండరు.





## దక్షిణ కొరియాలో కలకలం

### అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్ట్

ఎమర్జెన్సీ మార్షల్ లాపై తీవ్ర వ్యతిరేకత

అభిశంసనకు గురై అధికారం కోల్పోయిన యోల్

**మహా:** అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్టయ్యాయరు. మార్షల్ లా విధించి చట్టాన్ని ఉల్లంఘించినందుకు గానూ యోల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో అనూహ్యంగా ఎమర్జెన్సీ ప్రకటించి పెను చిక్కులను యోల్ తెచ్చుకున్నారు. బుధవారం తెల్లవారుజామున వందలాది మంది దర్యాప్తు అధికారులు అధ్యక్ష నివాసానికి చేరుకున్నారు. తొలుత అధ్యక్ష భద్రతా దళాలు వీరిని అడ్డుకున్నాయి. కొంతసేపు ప్రతిష్టంభన నెలకొన్న తర్వాత దర్యాప్తు అధికారులు అధ్యక్ష నివాసం లోపలికి వెళ్లి యూన్ సుక్ యోల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారీ భద్రత నడుమ ఆయనను అక్కడి నుంచి తరలించారు. గతంలో యోల్‌ను అరెస్టు చేసేందుకు ఓసారి ప్రయత్నించగా పెద్ద ఎత్తున ఉద్రిక్తత నెలకొంది. ఆ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని భద్రతను కట్టుదిట్టం చేశారు.

### ఎమర్జెన్సీ మార్షల్ లాతో..

ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ గతేడాది డిసెంబరులో దక్షిణ కొరియా అధ్యక్షుడు ఎమర్జెన్సీ మార్షల్ లా విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడం వల్ల యూన్ సుక్ తన ప్రకటనను విరమించుకున్నారు. కానీ ఆయన తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో మార్షల్ లా అమలును వ్యతిరేకిస్తూ తీర్మానం తీసుకువచ్చాయి. ఆ తర్వాత పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం మార్షల్ లా అమలు చట్టవిరుద్ధం అంటూ స్పీకర్ ప్రకటించారు. మార్షల్ లా ఉత్తర్వులు జారీ చేసి దేశాన్ని సంక్షోభంలోకి నెట్టినందుకు ఆయనకు వ్యతిరేకంగా విపక్షాలు పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి. తీర్మానానికి అనుకూలంగా 204 మంది ఓటేయగా 85 మంది మాత్రమే వ్యతిరేకించారు. దీంతో ఆయన అభిశంసనకు గురై అధ్యక్ష అధికారాలను కోల్పోయారు. మరోవైపు అత్యవసర పరిస్థితి విధించిన నేపథ్యంలో దానిపై విచారించేందుకు దర్యాప్తు అధికారులు పలుమార్లు సమన్లు జారీ చేశారు. వాటికి ఆయన స్పందించకపోవడం వల్ల కోర్టును ఆశ్రయించగా అరెస్టు వారెంట్ జారీ అయ్యింది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com |
whatsapp-
7436939999

# తెలంగాణలో చంపేస్తోన్న చలి

## మరో మూడ్రోజులు ఇదే పరిస్థితి..జాగ్రత్త అంటున్న వాతావరణ శాఖ అధికారులు



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రికార్డు స్థాయిలో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సంక్రాంతికి చంపేంత చలి ఉంటుందనే నానుడికి తగ్గట్లుగానే సంక్రాంతి పండగ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా చలి గాలుల ప్రభావం పెరిగింది. ఉదయం, రాత్రి వేళల్లో టెంపరేచర్లు పడిపోతున్నాయి. మరో మూడు రోజుల పాటు తెలంగాణలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తూర్పు, ఆగ్నేయ దిశలో వీస్తున్న గాలుల ప్రభావంతో చలి పెరిగింది. కొమురం భీం అసిఫాబాద్, అదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో టెంపరేచర్లు పడిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో 10 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంగారెడ్డి, మెదక్, హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లోనూ చలి ఎక్కువగా ఉంటోంది. రాష్ట్రంలో మరో మూడ్రోజుల పాటు ఇదే వాతావరణం ఉండే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు హెచ్చరికలు జారీ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా రానున్న మూడ్రోజులు ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పొగమంచు కారణంగా ఉదయం వేళ రహదారులు కనపడటం లేదు. ముందుగా ఎవరొస్తున్నారన్నది తెలియడం లేదు. దీంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండి వాహనాలు నడపాలని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం, రాత్రి పూట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుముఖం పడుతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు కూడా దాటడం లేదు. ఉదయం 8 దాటినా పొగమంచు కారణంగా రోడ్లు కనిపించకపోవటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### అరోగ్యంపై అప్రమత్తత

చలి గాలుల ప్రభావం పెరగటంతో ఆరోగ్య నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. ఈ సమయంలో శ్వాసకోస సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని చలి నుంచి రక్షణ పొందే దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణాలు మానుకోవాలని అంటున్నారు. వేడి వేడి ఆహారం తీసుకోవాలని.. గోరు వెచ్చని నీటిని మాత్రమే తాగాలని సూచిస్తున్నారు.

# సంక్షోభంలో మిర్చి రైతు

## భారీగా ధరలు పతనం.. ఎకరాకు గరిష్టంగా రూ.లక్షన్నర వరకు నష్టం

### గత ఏడాది కాలంగా ధరల తగ్గుదల.. సాగు గిట్టుబాటు కాక అల్లాడుతున్న రైతాంగం



**హైదరాబాద్, మహా :** మిర్చీ రైతు సంక్షోభంలో చిక్కుకున్నాడు. ఆరుగాలం కష్టపడి ాండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించక పోవడంతో రైతాంగం విలవిలలాడుతున్నారు. పెట్టుబడి పెరగడం, ఆదాయం తగ్గడంతో ఎకరా ఒక్కంటికీ లక్షన్నర రూపాయల వరకూ రైతులు నష్టపోతున్నారు. 201920, 202021లో సగటు క్వింటాలుకు ధర రూ.12 వేలు లభించింది. 202122లో రూ.13 వేలు, 202223లో రూ.20,500., 202324లో రూ.20 వేలు ధర పలికింది. 202425లో ఈ ధర ఎకాఎకిన రూ.13 వేలకు పతనమైంది. గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు గరిష్ట సగటు ధర రూ.13 వేలు దాటలేదు. కరోనా సమయంలో కొంత ఇబ్బంది ఎదురైనా ఆ తర్వాత రెండేళ్లు పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే, 2024, 2025లో ధరల పతనం కొనసాగుతోంది. 2022, 2023 సంవత్సరాల్లో మార్కెట్‌లో ధరలు బాగా ఉండటంతో ఇదే తరహాలో ధరలు పెరుగుతాయని ఆశించి రైతులు పెద్ద ఎత్తున మిర్చీ సాగుపై ఆసక్తి కనబర్చారు. అనూహ్యంగా గతేడాది జనవరి నుంచి ధరలు తగ్గడంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన సరుకు కదలడం లేదు. 2023తో పోలిస్తే మేలైన రకాలకు క్వింటాలుకు రూ. 10 నుంచి 15 వేల వరకు ధర తగ్గింది. మేలు రకాలు బాడిగ, దేవనారు డీలక్సు, తేజ వెరైటీలకు 2022, 2023 సంవత్సరాల్లో గరిష్టంగా రూ.20 వేల నుంచి రూ.28 వేల వరకు ధర పలికింది. గత ఏడాది, ఈ ఏడాది సగటున రూ.10 వేల నుంచి రూ.15 వేలు తగ్గింది. ఎకరాకు సగటున పది క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తుందని అంచనా. ధర తగ్గడంతో ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు రైతులకు నష్టం వస్తోంది.

గత ఏడాది ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ ఏడాదీ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుతం గుంటూరు పరిసర ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీల్లో 18 లక్షల టిక్కిల మిర్చి నిల్వ ఉంది. ప్రస్తుతం రాయలసీమ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి రోజుకు 40 వేల నుంచి 60 వేల టిక్కిలు వస్తున్నాయి. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న సరకు అమ్ముడుపోక, కొత్త సరకుకు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఎకరాకు రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు రెండేళ్ల క్రితం కనీసం లక్షన్నర వరకు లాభాలు వచ్చేవి. 2024లో ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. 2025లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఎగుమతి ఆర్డర్లు తగ్గాయని, ఇతర రాష్ట్రాల్లో కూడా మిర్చి సాగు పెరిగిందని, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేదని చెబుతూ గత కొంతకాలంగా మిర్చి ధరలను వ్యాపారులు తగ్గిస్తూ వస్తున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది ధరలు మరింత తగ్గాయి. గరిష్ట ధర మేలు రకాలకు రూ.15 వేలు, సాధారణ రకాలకు రూ. 13,500 మాత్రమే ధర పలుకుతోంది. పేరెన్నికగన్న స్పెషల్ వెరైటీలు తేజ, బాడిగ ధరలు కూడా భారీగా తగ్గాయి. తేజ కనిష్ట ధర రూ. 7,500, గరిష్ట ధర రూ.15,500 మాత్రమే లభిస్తోంది. బాడిగ కనిష్ట ధర రూ. 7,500, గరిష్ట ధర రూ. 13,500 వస్తోంది. దేవనారు డీలక్స్ కనిష్టం రూ. 8,500, గరిష్టం రూ. 15 వేలు మాత్రమే లభిస్తోంది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్న సరుకుకు ధరలు ఇంకా తగ్గుతున్నాయి. ధరల పతనంపై ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి సమీక్షా చేయలేదు. గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని మిర్చి రైతులు కోరుతున్నారు.



# కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయాభివృద్ధికి సహకరించండి

## రామగిరి కోటను టూరిజం హబ్‌గా మార్చండి

### కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షేకావత్ కు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి

**ఢిల్లీ, మహా :** 'కాళేశ్వరం - మంథని - రామగిరి'ని ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్ గా గుర్తించి... అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షేకావత్ ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు బుధవారం ఆయనను కలిసి మంథని నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం, రామగిరి కోటను టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపాలని వినతి పత్రం అందజేశారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలో గోదావరి నది ఒడ్డున వెలిసిన కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయానికి వేయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. దేశంలో ఎక్కడా కనిపించని విధంగా గర్భ గుడిలో రెండు శివలింగాలు పూజలందుకుంటున్నాయి. ఒకటి ముక్తేశ్వరునిది (శివుడు), మరొకటి కాళేశ్వరునిది (యముడు). ఏటా లక్షలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నారు. ఈ ఏడాది మేలో సరస్వతి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, 30 లక్షల నుంచి 40 లక్షల మంది ఇక్కడ పవిత్ర స్నానాలను ఆచరించేందుకు వస్తారని అంచనా వేస్తున్నట్లు ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి శ్రీధర్ బాబు వివరించారు. ఇక్కడే 2027లోనూ గోదావరి పుష్కరాలు జరగనున్నాయని, అప్పుడు కోటి మందికి పైగా వచ్చే అవకాశముందని తెలిపారు. సోమ్ నాథ్, కేదార్ నాథ్, మహాకాళేశ్వర్, అయోధ్య, కాశీల మాదిరిగా ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ ఆలయాన్ని కూడా ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, ఎకో టూరిజం హబ్ గా అభివృద్ధి చేయొచ్చన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి సమగ్ర ప్రణాళికను రూపొందించామని, దీని అమలుకు కేంద్రం సహకరించాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం పుష్కరాలు మొదలయ్యే నాటికి ఈ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. 'రామగిరి కోటకు సుమారు 1200 ఏళ్ల చరిత్ర ఉంది. రామాయణంలోనూ దీని గురించిన ప్రస్తావన ఉంది .రాముడి ఆలయాలు, జలపాతాలు, ఎన్నో ఔషధ మొక్కలు ఇక్కడున్నాయి. ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రానికి కావాల్సిన అన్ని ఆకర్షణలు ఇక్కడున్నాయి. ఈ కోటను సందర్శించేందుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తున్నారు. స్వదేశీ దర్శన్ 2.0 లేదా ఇతర పథకాల కింద ఈ కోటను మెగా టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలి' అని కేంద్ర మంత్రిని శ్రీధర్ బాబు కోరారు.

# నీటి కేటాయింపుల విషయంలో బలమైన వాదనలు వినిపించాలి

## ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ-1956 సెక్షన్ 3ని పరిగణనలోకి తీసుకోవాలి

### గోదావరి - బనకచర్లపై అభ్యంతరాలతో జల్‌శక్తి మంత్రి, ఏపీ ముఖ్యమంత్రికి లేఖలు

### పోలవరం ముంపుపై నిర్దేశిత సమయంలో ఐఐటీతో అధ్యయనం

### నీటి పారుదల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ఢిల్లీ, మహా :** తెలంగాణకు అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ)1956 సెక్షన్ 3 ప్రకారం నీటి కేటాయింపులు చేపట్టాలనే విషయంపై కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్II ఎదుట బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం (ఏపీఆర్ఏ)2014లోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టుల వారిగా నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఏపీఆర్ఏ ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్ సైతం సెక్షన్ 3 ఆధారంగా నీటి పంపకాలు రెండు రాష్ట్రాల మధ్య చేపట్టాలని సూచించిందని సీఎం తెలిపారు. కేడబ్ల్యూడీటీII తదుపరి విధి విధానాలపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా అత్యున్నత న్యాయస్థానం ఎటువంటి స్టే ఇవ్వని విషయాన్ని సీఎం గుర్తు చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటి పారుదల శాఖ) ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టడంపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు (జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ) తెలంగాణ తరపున అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రమైనా ఏ నదిపైనైనా ప్రాజెక్టు నిర్మించాలంటే జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీలతో పాటు పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలనే విషయాన్ని లేఖల్లో ప్రస్తావించాలని సీఎం సూచించారు. పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలం ముంపు విషయంపై హైదరాబాద్ ఐఐటీతో అధ్యయనం చేయించే అంశాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమ్మక్క సారక్క బ్యారేజీ, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం సూచించారు.



# లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

## కలెక్టర్లతో సీఎస్ శాంతి కుమారి

### అర్హులైన లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలి

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ఈనెల 21వ తేదీ నుండి నిర్వహించే గ్రామ సభలలో ఆమోదం పొందాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈనెల 26 వ తేదీన ప్రారంభించాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కార్యాచరణపై సీఎస బుధవారం జిల్లా కలెక్టర్లతో నేడు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, నాలుగు ప్రతిష్టాత్మక పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఏవిధమైన అపోహలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ పథకాలన్నీ నిజమైన అర్హులకే దక్కేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు భరోసాకు సంబంధించి భూముల వివరాలను రెవిన్యూ శాఖ ద్వారా వ్యవసాయ శాఖకు పంపడం జరిగిందని, సాగుయోగ్యం కాని భూములను క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించాలన్నారు. సంయుక్త సందర్శనలు నిర్వహించి, గ్రామసభల్లో వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు ప్రదర్శించి, చదివి వినిపించి ఆమోదం పొందాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి, ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాల జాబితాను, గ్రామ సభల్లో ప్రకటించి ఆమోదం పొందాలని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరీకై రూపొందించిన లబ్ధిదారుల ముసాయిదా జాబితా గ్రామసభల్లో ఆమోదం పొందాలన్నారు. ఇదే విధంగా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శక సూత్రాల ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారుల ముసాయిదా జాబితాను గ్రామాలలో ప్రదర్శించాలన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో, గ్రామపంచాయతీల వారిగా మరియు పట్టణ ప్రాంతాల్లో వార్డుల వారిగా సభలు నిర్వహించాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, లబ్ధిదారుల జాబితా ఎంపిక, డాటా ఎంట్రీ, క్షేత్ర స్థాయి వెరిఫికేషన్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ను ఆదేశించారు. ఇప్పటివరకు, ఈ నాలుగు పథకాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన, ప్రత్యేక బృందాల ఏర్పాటు, ముసాయిదా జాబితా తయారీ, డేటా ఎంట్రీ ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు చేసిన ప్రత్యేక శ్రద్ధని సీఎస్ అభినందించారు. నాలుగు పథకాల అమలుకై రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అనుగుణంగా అమలయ్యేలా సంబంధిత కార్యదర్శులు పర్యవేక్షించాలని శాంతి కుమారి ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. చౌహాన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసి కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.


# జోరుగా కోడి పందాలు

## కంట్రోలింగ్‌కు లేడీ బౌన్సర్లు

### కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టిన తాడేపల్లిగూడెం కోడి పందాల నిర్వాహకులు

**అమరావతి, మహా :** సినిమా నటులు, సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, బాగా డబ్బున్న ధనవంతులు ప్రజల్లోకి వచ్చినప్పుడు, ఏదైనా కార్యక్రమాల్లో పాల్గొనేటప్పుడు వారికి ప్రజల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా ప్రైవేటు సెక్యూరిటీనిఏర్పాటు చేసుకుంటారు. ప్రజల నుంచి తమను తాము రక్షించుకునేందుకు బౌన్సర్లను ఏర్పాటు చేసుకుంటారు. బౌన్సర్లు వీఐపీలకు రక్షణ వలయంగా ఉంటూ ఎవ్వరినీ దగ్గరు రానీకుండా కాపాడుతుంటారు. అంతేకాకుండా తమ చుట్టూ బౌన్సర్లను ఏర్పాటు చేసుకోవడం కూడా సమాజంలో ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అయితే ఇప్పుడు ఆ ట్రెండ్ మారింది. కోడిపందేల నిర్వాహకులు కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. సెక్యూరిటీ కోసం ఏర్పాటు చేసుకునే ఈ బౌన్సర్ల సంస్కృతిని తాజాగా కోడి పందేలకు విస్తరింప చేశారు. కోడి పందాల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా.. బరిలో పందెపు రాయుళ్లను కంట్రోల్ చేసేందేకు బౌన్సర్లను రంగంలోకి దింపారు. గతంలో ఎన్నడు లేని ఈ సంస్కృతిని ఈ సంక్రాంతి కోడి పందేల నుంచే ఆరంభించారు. అందులో లేడీ బౌన్సర్లను రంగంలోకి దింపడం స్పెషల్ అట్రాక్షన్ నిలిచింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్న కోడి పందేల బరుల వద్ద ఈ లేడీ బౌన్సర్లను ఏర్పాటు చేశారు. దాదాపు 50 నుంచి 100 మంది వరకు లేడీ బౌన్సర్లను రంగంలోకి దింపారు నిర్వాహకులు. టీనేజ్ యువతులను లేడీ బౌన్సర్లుగా రంగంలోకి దింపడం అదను అట్రాక్షన్ గా నిలిచింది. లేడీ బౌన్సర్లకు డ్రెస్ కోడ్‌ను ఏర్పాటు చేయడంలో కూడా జాగ్రత్తలు తీసుకున్నారు. కంప్లీట్ బ్లాక్ రంగులోని యూనిఫామ్‌ను వీరికి ఏర్పాటు చేశారు. బ్లాక్ టీషర్ట్, బ్లాక్ ప్యాంట్, బ్లాక్ క్యాప్‌తో పాటు ముఖానికి బ్లాక్ మాస్క్‌ను ధరించిన ఈ లేడీ బౌన్సర్లు కోడి పందేల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వీడియోలు ప్రస్తుతంసామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.





# తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు ఆరుగురు కొత్త జడ్జీలు

**ఢిల్లీ, మహా :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులకు జడ్జిలుగా పలువురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. తెలంగాణ హైకోర్టుకు నలుగురు, ఏపీ హైకోర్టుకు ఇద్దరి పేర్లను సిఫారసు చేసింది సుప్రీంకోర్టు కొలీజియం. తెలంగాణ హైకోర్టుకు వై రేణుక, నందికొండ నర్సింగరావు, తిరుమల దేవి, మధుసూదన్ రావు, ఏపీ హైకోర్టుకు హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు పేర్లను సిఫారసు చేసింది. జ్యుడిషియల్ ఆఫీసర్ల కోటాలో ఈ ఆరుగురు పేర్లను కొలీజియం సిఫారసు చేసింది.

# మన ఊరు మన ఎంఎల్ఏ పోస్టర్ ఆవిష్కరణ

## ప్రతి పల్లెను అభివృద్ధికి కేరాఫ్ గా మారుస్తాం.. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ,మహా ;** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని పల్లెలను అభివృద్ధికి కేరాఫ్ గా మారుస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం వేములపల్లి మండలం ఆమనగల్లు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి 'మన ఊరు మన ఎమ్మెల్యే' కార్యక్రమ పోస్టర్లను డీసీసీ అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ కలిసి ఆవిష్కరించారు. అదే విధంగా 15 మంది కళ్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మన ఊరు మన ఎమ్మెల్యే పేరిట ప్రతీ ఊరిని... సందర్శించి ప్రజలతో పాటు కార్యకర్తలను కలిసి చర్చిస్తామన్నారు. ఐక్యతను, అభివృద్ధిని విస్మరించి గ్రామాల్లో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తే సహించేది లేదన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసమే పని చేయాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు సొంత నిధులతో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలన్నింటిని అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. పార్టీలకతీతంగా పల్లెల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. రానున్న మహాశివరాత్రి నుండి ఈశ్వర బంధం స్కీంను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, పొదిల శ్రీనివాస్, స్కైలాబ్ నాయక్, సందీప్, కాంతారెడ్డి, రావు ఎల్లారెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.


## పకడ్బందీగా విచారణ చేపట్టాలి

### సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ




**మిర్యాలగూడ,మహా :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా స్కీమ్ ల అమలుకు ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పకడ్బందీగా విచారణ చేపట్టాలని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీ కుటుంబాలకు రెండు విడతలుగా ఏడాదికి రూ. 12 వేలు అందించనుందన్నారు. ఈ పథకంతో పాటు ఇతర స్కీమ్ లకు ఈ నెల 16 నుంచి 20 వరకు ఫీల్డ్ ఎంక్వయిరీ... 21వ తేదీ నుంచి 24 వరకు గ్రామ సభల నిర్వహణతో పాటు సేకరించిన వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను 25వ తేదీ వరకు కంప్లీట్ చేస్తారన్నారు. అదేరోజు జిల్లా మంత్రి తో లబ్ధిదారుల జాబితా ఆమోదం పొందిన అనంతరం ఈనెల 26 నుంచి ఆయా స్కీమ్ ల సాంక్షన్ ఆర్డర్ లను ఇస్తారని చెప్పారు. అర్హులకు మాత్రమే స్కీమ్ లను వర్తింప చేయాలని చేయాలన్నారు.అదేవిధంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఇండ్లను కోల్పోయిన వారిలో 116 మంది ఉద్యోగాలకు అర్హులుగా గుర్తించి టీఎస్ జెన్కో బోర్డుకు అప్రూవల్ కోసం పంపినట్లు చెప్పారు. అదేవిధంగా భూములను కోల్పోయిన వారిలో 525 కుటుంబాల్లో 400 ఫ్యామిలీలు అప్లికేషన్ చేసుకోగా... వీరిలో 220 మందికి అర్హత పొందారని తెలిపారు. భూములు కోల్పోయిన వారిలో కొంతమంది అప్లికేషన్ చేసుకునేందుకు నేటికి స్పందించలేదని ఈ ప్రక్రియ ఈనెల 16తో ముగుస్తుందని చెప్పారు.సమావేశంలో తహశీల్దార్ హరిబాబు ఉన్నారు.





## అయ్యప్ప ఆలయాన్ని దర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి చాందా బెల్లూరి లోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సూర్యకాంత్, ప్రధాన కార్యదర్శి రవీందర్, అర్చకులు సంతోష్ శర్మ, కౌన్సిలర్ బండారి సతీష్, నాయకులు దాసరి ఆశన్న, మోర ఆశన్న, గురుస్వాములు సునీల్, మధు పాల్గొన్నారు.



### బీఆర్ఎస్ కుటుంబాలను


## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

**వరంగల్ మహా:** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం దేశాయిపల్లి గ్రామంలోని ఇటీవల మృతి చెందిన బిఆర్ఎస్ కుటుంబలను లాసాని రాధమ్మ, నల్లబెల్లి నాగమ్మ,సళ్ళ లచమ్మ కుటుంబాన్ని పరామర్శించిన నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మోర్తల నరసింగరావు, నల్లబెల్లి పోశాలు, తుత్తూరు దూడమ్మ, ఆరోగ్య పరిస్థితులను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, PACS చైర్మన్, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీల తోపాటు పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మం పత్తి మార్కెట్‌లో

## భారీ అగ్నిప్రమాదం

### 400 పత్తి బస్తాలు అగ్నికి ఆహుతి



**ఖమ్మం, జనవరి 15, మహా:** ఖమ్మం పత్తి మార్కెట్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాదం బారి నష్టానికి దారితీసింది. మంటలు భారీగా ఎగిసిపడటంతో దాదాపు 400 పత్తి బస్తాలు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం 13 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈనెల 16వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఉన్న నేపథ్యంలో కొందరు వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని మార్కెట్ యార్డులో నిల్వ చేశారు. అదే సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంటలు క్రమంగా పెరుగుతుండటంతో అగ్నిమాపక సిబ్బందిని వెంటనే సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు చాలా సేపు శ్రమించారు. మంటలతో పాటు పొగలు దట్టంగా వ్యాపించడంతో మార్కెట్ పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొందరు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి మార్కెట్ ప్రాంగణంలో ఇతర వస్తువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదంలో కాలిపోయిన పత్తి వ్యాపారుల ఆస్తిగా భావిస్తున్నారు. సంక్రాంతి తర్వాత మార్కెట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యే సమయంలో ఈ నష్టం వారికి తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని తెచ్చే అవకాశముంది. అగ్నిప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి కారణాలను వెల్లడించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నష్టానికి బాధ్యత వహించే కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న వ్యాపారులు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం కోరుతున్నారు. పత్తి నిల్వల భద్రతకు సంబంధించి మరింత కఠిన చర్యలు తీసుకోవాలని వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### పశ్చిమ ఎమ్మెల్యేను కలిసిన జిల్లా

## ఐఎంఏ నూతన కార్యవర్గం

**హనుమకొండ, మహా:** నగరంలోని బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని బుధవారం హనుమకొండ జిల్లా ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఐఎంఏ జిల్లా కార్యవర్గం వారు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు, దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని, ప్రజారోగ్యం బలోపేతం కోసం కృషి చేస్తున్న ఐఎంఏ జిల్లా కార్యవర్గాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేను అధ్యక్షులు డా కె. నాగార్జునరెడ్డి, కార్యదర్శి డా. అజిత్ మహామ్మద్, కోశాధికారి డా. శిరీష్‌కుమార్, డా. మన్మోహన్ రాజ్, టీజీ ఎంసీ సభ్యులు, జిల్లా ఉపాధ్యక్షులు డా. నరేష్‌కుమార్, ఐఎంఏ స్టేట్ కౌన్సిల్ సభ్యులు డా. ప్రసన్న కుమార్ తదితరులు ఉన్నారు.

## అన్నారం దర్గాకు గిలాఫ్‌ను సమర్పించిన మాజీ ఎమ్మెల్యే



**వరంగల్, మహా:** అన్నారం షరీఫ్ దర్గాలో నిర్వహించే ఉర్సు ఉత్సవాలకు గిలాఫ్ ను బుధవారం తెలంగాణ రాష్ట్ర వరంగల్ తొలి మేయర్, మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో దర్గాకు ప్రత్యేకమైన ప్రార్థనల అనంతరం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, వరంగల్ మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి పోలీసుల నోటీసులు

### గురువారం విచారణకు రావాలని ఆదేశం

### శుక్రవారం వస్తానన్న కౌశిక్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు రావాలని కౌశిక్ రెడ్డిని ఆదేశించారు. అయితే గురవారం కరీంనగర్ కోర్టుకు హాజరుకావాల్సి ఉందని, అందువల్ల శుక్రవారం విచారణకు హాజరవుతానని కౌశిక్ రెడ్డి తెలిపారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కౌశిక్ రెడ్డిపై గతంలో కేసు నమోదైన విషయం తెలిసిందే. గతనెల 4న తన ఫోన్ ట్యాప్ అవుతుందని కౌషిక్ రెడ్డి బంజారాహిల్స్ పీఎస్‌కి వచ్చారు. అదే సమయంలో బయటకు వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ వాహనానికి తన వాహనాన్ని అడ్డు పెట్టి అనుచరులతో కలిసి పీఎస్‌లో హల్‌చల్ చేశారు. తన విధులు అడ్డుకోవడమే కాకుండా బెదిరింపులకు దిగిన వ్యవహారంపై ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఫిర్యాదుపై అదే పీఎస్‌లో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు అధికారిగా మాసబ్ ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురాంను వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ నియమించారు. ఇందులో భాగంగా మాసబ్ ట్యాంక్ పోలీసులు కౌశిక్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. తనపై అన్యాయంగా కేసులు పెడితే ఇంకా రెట్టింపు ఉత్సాహంతో ప్రశ్నిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ శిక్షణ ఇచ్చిన బిడ్డను ఏ మాత్రం భయపడను అని స్పష్టం చేశారు. తాను తప్పు చేసినట్లు రుజువైతే ఉరి తీయండని సవాల్ విసిరారు. తన అరెస్టు, కరీంనగర్ కోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజాగా తనకు మళ్ళీ పోలీసులు నోటీసులు ఇచ్చారని తెలిపారు.

## ఉత్కంఠ భరితంగా ఢిల్లీ ఎన్నికలు

### మూడు పార్టీల మధ్య హోరాహోరీ.. ఆప్ నిలుస్తుందా? తడబడుతుందా?

### గట్టిపోటీనిస్తున్న బిజెపి.. ట్రయాంగిల్ పై కాంగ్రెస్ ఆశలు



**మహా:** ఫిబ్రవరి 5న ఢిల్లీలో అసెంబ్లీలు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పుడు దేశ రాజకీయాలు దేశ రాజధాని చుట్టే తిరుగుతున్నాయి. పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ విజయం సాధించే దిశగా తీవ్రంగా కృషి చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఢిల్లీలో ఢీ అంటే ఢీ అన్నట్టుగా ఉంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈసారి అక్కడ గెలిచేది ఎవరంటూ జనాలు, రాజకీయ పార్టీలు, నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. పలు సర్వే సంస్థలు కూడా సర్వే చేసి ప్రజలు ఏ పార్టీ వైపు ఎక్కువగా మొగ్గు చూపే అవకాశం ఉందనేది చెబుతున్నాయి. అయితే, ఢిల్లీలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీకే ప్రజలు పట్టం కట్టే అవకాశం ఉందంటూ అవి పేర్కొంటున్నాయి. దాదాపు అన్ని సర్వేలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కాగా, పలు సర్వేలు ఆప్ భారీ సీట్లతో గెలిచి అవకాశం ఉందని చెబుతున్నాయి. అటు ప్రతిపక్ష పార్టీలకు సింగిల్ డిజిట్ దాటే అవకాశం లేదని చెబుతున్నాయి. మరికొన్ని సర్వేలు మాత్రం ఆప్ గెలుస్తది కానీ, కొద్దిమేర తేడాతో మాత్రమే విజయం సాధిస్తుందంటూ అంచనా వేస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు డబుల్ డిజిట్ లో సీట్లు సాధించే అవకాశం లేకపోలేదని చెబుతున్నాయి. కానీ, ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఈసారి తమదే విజయం అనే భావనను తెలియజేస్తున్నాయి.

#### హామీలు, విమర్శలు, ప్రతి విమర్శలు..

ఇటు నేతలు కూడా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో విమర్శలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఇటు హామీలప కూడా పార్టీలు భారీగావ్ ప్రకటిస్తున్నాయి. అయితే, ఈసారి ఎక్కువగా మహిళలు, యువతకు భారీ హామీలు ఇచ్చాయి. తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి, నగదు అందజేస్తామంటూ హామీ ఇస్తున్నాయి. ముఖ్యంగా మూడు పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, ఆప్... వీటి మధ్య త్రిముఖ పోరు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో భారీ ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఆ పార్టీల కీలక నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకుంటున్నారు. ఇటీవలే ఆప్ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్... కేంద్రమంత్రి అమిత్ షాకు సవాల్ విసిరారు. మురికివాడల్లో ఇండ్లు కట్టిస్తామంటూ అమిత్ షా హామీ ఇవ్వాలని అప్పుడు తాను ఎన్నికల్లో పోటీ చేయను అంటూ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ఇటు బీజేపీ కూడా ఆప్ పైన తీవ్ర స్థాయిలో ఫైరవుతుంది. అధికారంలో ఉన్న ఆప్ ఢిల్లీని భారీగా దోచుకున్నదంటూ ఆరోపణలు చేసింది. అటు కాంగ్రెస్ కూడా ఈ రెండు పార్టీలను కడిగిపారేస్తుంది. అణగారిన వర్గాల అభివృద్ధి ఆ పార్టీలకు ఇష్టంలేదంటూ ఆరోపించింది. ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే కుల గణనను చేపట్టి, రిజర్వేషన్లను పెంచుతామన్నారు. ఇలా హామీలు, విమర్శలు, ప్రతి విమర్శలు, సవాళ్లు, ప్రతి సవాళ్లతో ఢిల్లీ హీటెక్కిపోతుంది.

#### ఎవరి ధీమా వారిదే...

ఏ పార్టీకి ఆ పార్టే తమ గెలుపుపై అంచనా వేసుకుంటున్నాయి. మొదటగా ఆప్ విషయానికి వస్తే తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన హామీలు, పథకాల నేపథ్యంలో ఢిల్లీ ప్రజలు తమకు మరోసారి అధికారాన్ని కట్టబెడుతారంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే ఈసారి అధిక మెజారిటీతో గెలిపిస్తారంటూ చెబుతున్నారు. అటు బీజేపీ విషయానికి వస్తే తాము నిరుద్యోగులకు, యువతకు, ముఖ్యంగా మహిళలకు కీలక హామీలు ఇచ్చాం.. ఈ క్రమంలో గెలుపు తథ్యం అని భావిస్తుంది. ఇప్పటికే ఢిల్లీ ప్రజలు ఆప్ తో విసిగిపోయి ఉన్నారని, స్కామ్ ల కారణంగా ప్రజలు ఆప్ కు ఓటు వేయరని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరో విషయమేమంటే ఇటీవలే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తోపాటు పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఢిల్లీలో కూడా ఈసారి బీజేపీకే పట్టం కట్టే అవకాశం లేకపోలేదని చర్చించుకుంటున్నారు. అటు కాంగ్రెస్ విషయానికి వస్తే.. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆప్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ప్రజలు గుర్రుగా ఉన్నారని, ఈసారి తమకు అధికారం కట్టబడుతారంటూ ఆకాంక్షిస్తుంది. కీలకమైన హామీలు కూడా అందుకు దోహదపడుతాయని అంచనా వేస్తుంది. ముఖ్యంగా దళిత సీట్లలో తమకు ఎక్కువగా సీట్లు వస్తాయని, ఈ అన్ని పరిస్థితుల్లో తాము అధికారంలోకి రాబోతున్నామంటూ ఆశాభావం వ్యక్తం చేస్తుంది. చూడాలి మరి.. చివరకు ప్రజలు ఈ ఎన్నికల్లో ఎవరికి పట్టం కడుతారనేది.

## లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరగాలి

### జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడే




**హనుమకొండ మహా:** ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరగాలని జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడే అధికారులను ఆదేశించారు. బుధవారం హన్మకొండ నక్కలగుట్ట మునిసిపల్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా జనవరి 26న అమలు చేయనున్న సంక్షేమ పథకాలైన (రైతు భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇళ్లు) విధి విధానాలపై సమీక్షించారు. ఈ నెల 21 నుంచి 25 వరకు గ్రామ సభలు పక్కాగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, వార్డు సభల్లో అందించే అర్జీలను స్వీకరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలని, విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హన్మకొండ జెడ్పి సీఈఓ, నోడల్ అధికారి విద్యాలత, జిల్లా పౌరసరఫరాల అధికారి కొమురయ్య,ఉప కమిషనర్ రవీందర్ , తహశీల్దార్లు, సర్వే బృందాలు తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లలో వేగం పెంచండి

### గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి..



**వరంగల్ మహా:** గ్రేటర్ వరంగల్ మహా నగరంలో పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని నగర మేయర్ గుండు సుధారాణి రెవేన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో పన్ను వసూళ్ల పురోగతిపై వార్డు ఆఫీసర్లు రెవిన్యూ అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పన్ను వసూళ్లలో నిర్దిష్ట లక్ష్యాలను చేరుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకోసం ఇప్పటినుండే ప్రణాళిక బద్ధంగా వసూళ్లు జరిగేలా చూడాలని పెద్ద మొత్తంలో బకాయి ఉన్న సంస్థలు ఇన్స్టిట్యూషన్స్ పై ప్రత్యేక దృష్టిసారించాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, ఆర్ ఓ లు షహజాది బేగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఫ్రీ మటన్

### కనుమ పండుగ ఆఫర్

### సంగారెడ్డిలో బీఆర్ఎస్ నేత పంపిణీ

**సంగారెడ్డి, మహా :** ఎన్నికల సమయంలో ఇంటింటికీ తాయిలాలు పంపటం పరిపాటి. ఒటర్లను ఆకర్షించేందుకు ఇళ్ల వద్దకే వారికి కావాల్సిన నిత్యావసరాలను పంపడమూ మామూలే. అయితే సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఇంటికీ క్యారేజీ పంపారో బీఆర్ఎస్ నేత. కనుమ పండుగ సందర్భంగా ప్రతి ఇంటికీ స్టీల్ బాక్స్ పంపించారు. స్టీల్ బాక్స్ లో మటన్ పెట్టి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామానికి బీఆర్ఎస్ యూత్ లీడర్ పడమటి అనంతరెడ్డి తాజాగా కనుమ పండుగను పురస్కరించుకుని గ్రామంలో సుమారుగా 440 కుటుంబాలు ఉండగా, దాదాపు 400 కుటుంబాలకు మాంసం పంపిణీ చేశారు. మిగతా కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గతంలోనూ కొవిడ్ వచ్చిన సమయంలో అనంతరెడ్డి ఇలాగే స్పందించారు. లాక్ డౌన్ సమయంలో ప్రజలు నిత్యావసరాల కోసం ఇబ్బందులు పడుతున్న సందర్భంలో నిత్యావసరాలను, సరుకులు ఇంటి వద్దకే పంపిణీ చేసి మంచి పేరు తెచ్చుకున్నారు.



## అనవసర అపోహాలను నమ్మొద్దు

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్, మహా:** ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు చేరేలా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నట్లు, అందుకు గాను ఈ నెల 16 నుండి 20 వరకు నిర్వహించే క్షేత్ర స్థాయి పరిశీలన, 21 నుండి 25 వరకు గ్రామ, వార్డు సభలకు జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు పథకాల క్షేత్ర స్థాయిలో పరిశీలన, గ్రామసభల నిర్వహణకు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణిని జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు, పథకాల వారీగా రైతు బంధుకు జిల్లా వ్యవసాయ అధికారిని, ఇందిరమ్మ ఆత్మీయ పథకానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ)ను, రేషన్ కార్డులకు జిల్లా పౌరసరఫరాల అధికారి, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జిల్లా పరిషత్తు సీఈవోను నోడల్ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని 11 మండలాలు, 32 జీడబ్ల్యూఎంసీ వార్డులు, నర్సంపేట, వర్ధన్నపేట వార్డులకు మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో బృందాలను నియమించడం జరిగిందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి ప్రారంభించనుందని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పంట వేసినా, వేయక పోయినా అందుతుందని, రైతులు అనవసర అపోహాలు పెట్టుకోవద్దని, రైతు భరోసా పథకానికి ఎటువంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రూ. 12 వేలు పెట్టుబడి సహాయం ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12 వేలు రూపాయలను అందించనున్నట్లు, ఒక్కో విడతకు రూ. 6 వేల చొప్పున రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనుందని, 202324 సంవత్సరానికి ఉపాధి హామీ క్రింద పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. జిల్లాలో 20 రోజులు ఉపాధి హామీ కూలీలుగా పనిచేసిన కార్మికుల జాబితాను తీసుకొని ఆధార్ కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమిలేని కుటుంబాలను ఎంపిక చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ద్వారా సొంత భూమి ఉండి ఇండ్లు లేని కుటుంబాల జాబితాను సిద్ధం చేశామని అన్నారు.



# హైదరాబాద్‌కు గిరాకీ నై

**ఢిల్లీ :** వచ్చే ఏడాది మార్చిదాకా హైదరాబాద్‌లో 25 శాతం ఆఫీస్ స్పేస్ ఖాళీగానే ఉండొచ్చని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఐసీఆర్‌ఏ అంచనా వేస్తున్నది. డిమాండ్‌కు మించి మార్కెట్‌లోకి కొత్తగా ఆఫీస్ స్పేస్ వస్తున్నదని ఐసీఆర్‌ఏ ప్రతినిధి అనుపమ రెడ్డి చెప్తున్నారు. ఇదిలావుంటే గోద్రేజ్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో తమ తొలి హౌజింగ్ ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. కోకాపేట్‌లో 3 ఎకరాల్లో ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను తెస్తున్నది.

## ఈ ఏడాది వారికే ఎక్కువ జీతాలు



ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరూ.. జీతాలు ఎప్పుడెప్పుడు పెరుగుతాయా అని ఎదురుచూస్తూ ఉంటారు. అయితే ఈ ఏడాది ఉద్యోగులకు సగటున 9.4 శాతం పెంపు (హైక్) ఉండే అవకాశం ఉంటుందని, HR కన్సల్టింగ్ సంస్థ మెర్సెర్ టోటల్ రెమ్యూనరేషన్ సర్వే వెల్లడించింది. గత ఐదేళ్లుగా ఉద్యోగుల జీతాలు పెరుగుతూనే ఉన్నాయని పేర్కొంది. 2020లో ఉద్యోగుల వేతనాలు 8 శాతం పెరిగాయి. ఈ ఏడాది 9.4 శాతం పెరగనున్నట్లు అంచనా. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, కన్స్యూమర్ గూడ్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోమోటివ్, ఇంజినీరింగ్ వంటి విభిన్న పరిశ్రమలతో విస్తరించి ఉన్న భారతదేశంలోని 1,550 కంటే ఎక్కువ కంపెనీలను సర్వే చేసి.. జీతాల పెంపు గురించి మెర్సెర్ టోటల్ రెమ్యూనరేషన్ సర్వే ప్రస్తావించింది. ఎలక్ట్రిక్ వాహనాల పెరుగుదల, ప్రభుత్వం నేతృత్వంలోని 'మేక్ ఇన్ ఇండియా' చొరవ కారణంగా ఆటోమోటివ్ రంగం రోజు రోజుకి అభివృద్ధి చెందుతోంది. కాబట్టి ఈ రంగంలో జీతాలు 8.8 శాతం నుంచి 10 శాతం వరకు పెరగవచ్చు. ఆ తరువాత స్థానంలో మ్యానుఫ్యాక్చరింగ్, ఇంజినీరింగ్ విభాగాలు ఉన్నాయి. ఈ రంగాల్లోని ఉద్యోగులకు జీతాలు జీతాలు 8 శాతం నుంచి 9.7 శాతం వరకు పెరగవచ్చు. జీతాలను మాత్రమే కాకుండా.. ఈ ఏడాది 37 శాతం సంస్థలు విభిన్న రంగాలలో.. ఉద్యోగులను కూడా పెంచుకోవడానికి చూస్తున్నట్లు సమాచారం. వివిధ అంశాలలో నైపుణ్యం కలిగిన వారికే ఎక్కువగా ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సుమారు 11.9 శాతం ఉద్యోగులు స్వచ్ఛందంగా ఉద్యోగాల నుంచి వైదొలిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ సంవత్సరం కొన్ని సంస్థలు ప్రతిభను ఆకర్షించడానికి, టర్నోవర్‌ను తగ్గించడానికి.. శ్రామికశక్తి డిమాండ్‌లను పరిష్కరించేందుకు కావలసిన ప్రయత్నాలను చేస్తున్నాయి.

# ఐఫోన్ 16పై భారీ డిస్కౌంట్‌లు..

## ధర ఎంత తగ్గిందంటే..!



రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ (Flipkart) నిర్వహిస్తున్న తన మాన్యుమెంటల్ సేల్‌లో ఐఫోన్ 16 (iphone 16) పై భారీ డిస్కౌంట్‌లు అందిస్తోంది. దాంతో వినియోగదారులు ఈ సేల్‌లో ఐఫోన్ 16పై భారీ డిస్కౌంట్‌లు పొందే అవకాశం ఉంది. 'ఐఫోన్ 16' 128GB మోడల్ ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్ యాప్, వెబ్‌సైట్‌లో రూ.67,999కి అందుబాటులో ఉంది. అయితే ఈ ఆఫర్ ఫ్లిప్‌కార్ట్ ప్లస్, ప్రీమియం సభ్యులకు మాత్రమే వర్తిస్తుంది. నాన్‌మెంబర్స్‌కు అయితే ఈ ఐఫోన్ రూ.69,999కు లభిస్తుంది. ఈ ఐఫోన్‌పై ఫ్లిప్‌కార్ట్ డిస్కౌంట్ ఆఫర్‌తోపాటు ఎంపిక చేసిన బ్యాంక్ డిస్కౌంట్లు కూడా పొందవచ్చు. బ్యాంక్ డిస్కౌంట్‌లు కలుపుకుని రూ.64,499కే ఈ ఫోన్‌ను సొంతం చేసుకోవచ్చు. ఎంపిక చేసిన బ్యాంక్ ఆఫర్‌లతో రూ.3,500 వరకు అదనపు తగ్గింపును పొందొచ్చు. మీరు ఫ్లిప్‌కార్ట్ ప్లస్/ప్రీమియం సభ్యులు అయితే ఐఫోన్ 16 బేస్ మోడల్ రూ.64,499కే వస్తుంది. నాన్‌మెంబర్స్ ఈ ఫోన్‌ను రూ.66,499కి పొందవచ్చు.

### ఫోన్ ప్రత్యేకతలు

ఈ ఐఫోన్‌లో 6.1 అంగుళాల OLED స్క్రీన్ ఉంటుంది. అదేవిధంగా 2556 x 1179 పిక్సల్స్ రిజల్యూషన్‌ను కలిగి ఉంది. డెన్సిటీ విషయానికొస్తే 460 ppi పిక్సెల్. వాటర్, స్ప్లాషెస్, డస్ట్ ప్రొటెక్షన్‌తో ఈ ఐఫోన్ IP68 రేటింగ్‌తో వస్తుంది. ఫొటోలు తీసేందుకు, వీడియోలను రికార్డ్ చేసేందుకు ఈ ఫోన్ త్వరిత కెమెరా యాక్సెస్‌ను అందిస్తుంది. 48MP ఫ్యూజన్ కెమెరా ఉంది. ఇందులో 2x టెలిఫోటో లెన్స్, 12MP అల్ట్రావైడ్ కెమెరా ఉన్నాయి. ఇది సెల్ఫీల కోసం/1.9 ఎపర్చర్‌తో 12MP ట్రూడెప్త్ ఫ్రంట్ కెమెరా కూడా ఉంది. వీటితోపాటు ఈ ఫోన్‌లో ఆడియో మిక్స్ వంటి కొత్త ఆడియో ఎడిటింగ్ టూల్స్, ఫోన్ ఫొటో, వీడియో క్యాప్చర్ సపోర్ట్, క్యాప్చర్ తర్వాత ఆడియో ఎడిటింగ్ టూల్స్ కూడా ఉన్నాయి. ఈ ఫోన్ మెషిన్ లెర్నింగ్ ద్వారా నాయిస్‌ను తగ్గించగలదు. ఇది బ్యాక్‌గ్రౌండ్ నాయిస్‌ను తగ్గిస్తుంది. వీడియోగ్రఫీకి ఇది ఒక గ్రేట్ ఆప్షన్. A18 బయోనిక్ చిప్ ఆధారితమైన ఈ ఐఫోన్ పనితీరును మెరుగుపరచడానికి యాపిల్ ఇంటెలిజన్స్ సెకండ్ జనరేషన్ 3నానోమీటర్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు.






# కేంద్ర మంత్రికి మెటా క్షమాపణలు

మెటా సీఈఓ మార్క్ జూకర్‌బర్గ్ చేసిన పొరపాటుకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు సంస్థ క్షమాపణలు చెప్పింది. 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మార్క్ జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యలపై కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీకి సారథ్యం వహిస్తున్న డాక్టర్ నిషికాంత్ దూబే నేతృత్వంలోని ప్యానెల్ మెటాకు సమన్లు జారీ చేయాలని యోచించినట్లు ఇటీవల వార్తలొచ్చాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మెటా సీఈఓ చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణం. కోవిడ్ 19 మహమ్మారిని నిర్వహించడంలో భారత ప్రభుత్వం విఫలమైందని జుకర్‌బర్గ్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో అన్నారు. దాంతో ప్రస్తుత ప్రభుత్వం 2024 ఎన్నికల్లో విజయం సాధించబోదని చెప్పారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక ఈ అంశంపై అప్పట్లో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందిస్తూ మార్క్ జూకర్‌బర్గ్ మాటలు తప్పని రుజువైందన్నారు. ప్రజలు తమ పార్టీకే స్పష్టమైన మెజార్టీ అందించారని చెప్పారు. జూకర్‌బర్గ్ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీకి నేతృత్వం వహిస్తున్న డాక్టర్ దూబే ప్రజాస్వామ్య దేశంలో ఖచ్చితమైన సమాచారం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. 'ఈ తప్పుడు సమాచారాన్ని వ్యాపింప చేసినందుకు కమిటీ మెటాపై చర్య తీసుకోవాలని చూస్తుంది. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా తప్పుడు సమాచారం దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. ఈ పొరపాటుకు ఆ సంస్థ భారత పార్లమెంటుకు, ఇక్కడి ప్రజలకు క్షమాపణలు చెప్పాలి' అని దూబే అన్నారు. ఈ వ్యవహారంపై మెటా స్పందించింది.మెటా పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ శివంత్ తుక్రాల్ కంపెనీ సీఈఓ చేసిన తప్పుకు క్షమాపణలు కోరారు. కంపెనీకి భారత్ ఎంత ప్రాముఖ్యమైందో పునరుద్ఘాటించారు. 'అధికారంలో ఉన్న అనేక పార్టీలు 2024 ఎన్నికల్లో తిరిగి విజయం సాధించవనే మార్క్ వ్యాఖ్యలు అనేక దేశాలకు వర్తిస్తుంది. కానీ, భారత్ అందుకు మినహాయింపు. ఈ అనుకోని పొరపాటుకు మేం క్షమాపణలు కోరుతున్నాం. కంపెనీకి భారత్ ఎంతో ప్రాముఖ్యమైంది' అని తుక్రాల్ అన్నారు.



# దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL




## యుద్ధనౌకలు, జలాంతర్గామిలను ప్రారంభించిన ప్రధాని మోదీ

**ముంబై:** దేశంలో అధునాతన యుద్ధనౌకలు ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను జాతికి అంకితం చేశారు ప్రధాని నరేంద్ర మోదీ. ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో బుధవారం నౌకలను మోదీ ప్రారంభించారు. ఈ యుద్ధనౌకలతో భారత నేవీ బలం మరింత పెరగనుంది. ఆయుధ తయారీ, సముద్ర భద్రతలో అగ్రగామి కావాలన్న లక్ష్యసాధన దిశగా భారత్ ముందుకు సాగుతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ..ప్రపంచంలో బలమైన శక్తిగా భారత్ మారుతోంది. భద్రమైన సముద్ర మార్గాల కోసం ప్రయత్నిస్తున్నాం. ఈ మూడు మేడిన్ ఇండియా. మేము విస్తరణవాదంతో కాదు.. వికాసవాదంతో పనిచేస్తాం. రక్షణ రంగంలో మేకిన్ ఇండియా ఆవిష్కృతం అవుతోందన్నారు. అలాగే, వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్. ఈ మూడు యుద్ధ నౌకలు భారత్‌కు మరింత శక్తినిస్తాయి అని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ కార్గో మార్గాలను భారత్ కాపాడుతోంది. నేవీ బలోపేతం వల్ల ఆర్థిక ప్రగతి కూడా కలుగుతుందన్నారు. ఐఎన్ఎస్ సూరత్.. పీ15బీ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధనౌకల్లో ఇదొకటి. ఇందులో స్వదేశీ వాటా 75 శాతం. ఈ యుద్ధనౌకలో అధునాతన ఆయుధ సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయి. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతం.



# చంద్రబాబుకు బిగ్ రిలీఫ్

## చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని పిటిషన్.. పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు



**ఢిల్లీ, మహా :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. స్కిల్ డవలప్ మెంట్ కేసులో సుప్రీం కోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీం కోర్టు కొట్టి వేసింది. బుధవారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు స్కిల్ డవలప్ మెంట్ కేసులో ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలైన నేపథ్యంలో బెయిల్ రద్దు విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరంలేదని, బెయిల్ రద్దు అంశంలో తాము కల్పించుకోలేమని పేర్కొంది. అయితే అవసరమైన సందర్భాలలో విచారణకు సహకరించాల్సి ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడుకు సుప్రీంకోర్టు సూచించింది. చంద్రబాబునాయుడు బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టి వేసింది. ఈ మేరకు జస్టిస్ బేలా ఎం త్రివేది నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ బుధవారం తీర్పును వెలువరించింది. సీఎం చంద్రబాబునాయుడు తరఫున న్యాయవాది ముకుల్ రోహిత్గీ వాదనలను వినిపించారు.

ఏపీలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో స్కిల్ డవలప్ మెంట్ కేసు వెలుగులోకి వచ్చింది. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుపై అభియోగాలు నమోదయ్యాయి. ఇదే అభియోగంపై అప్పట్లో నంద్యాల పర్యటనలో ఉన్న చంద్రబాబును 9 సెప్టెంబర్ 2023న అరెస్టు చేశారు. సీఐడీ విచారణ అనంతరం చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. దాదాపు 52 రజుల పాటు జైల్లో ఉన్న చంద్రబాబునాయుడు అక్టోబర్ లో విడుదలయ్యారు. హైకోర్టు బెయిల్ మంజూరుపై అప్పట్లోనే వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు చంద్రబాబుకు మంజూరు చేసిన బెయిల్ ను రద్దు చేయాలని అభ్యర్థించింది. దీనిపైన బుధవారం విచారణ జరిపిన జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం ఆ బెయిల్ రద్దు పిటిషన్ ను కొట్టి వేస్తూ సీఎం చంద్రబాబుకు ఊరటను కలిగిస్తూ తీర్పును వెలువరించింది. అయితే కేసు విచారణకు సహకరించాలని చంద్రబాబునాయుడును కోర్టు ఆదేశించింది.

### జర్నలిస్ట్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

మరోవైపు చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఇంప్లీడ్ పిటిషన్ వేసిన జర్నలిస్టు మీద సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీకేం సంబంధమంటూ ప్రశ్నించింది. సంబంధం లేని వ్యవహారాల్లో పిటిషన్ ఎలా వేస్తారని మండిపడింది. ఇంకోసారి ఇలాంటివి పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ జస్టిస్ బేలా త్రివేది జర్నలిస్టును హెచ్చరించారు. అలాగే ఇంప్లీడ్ పిటిషన్ కొట్టివేశారు. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్ దాఖలు చేసిన స్వర్ణాంధ్ర పత్రిక విలేఖరి బాలగంగాధర్ తిలక్. బెయిల్ వ్యవహారాల్లో మూడో వ్యక్తి (థర్డ్ పార్టీ) ఎందుకు ఉంటారని ప్రశ్నించిన ధర్మాసనం. సంబంధ లేని బెయిల్ వ్యవహారాల్లో పిటిషన్ ఎలా వేస్తారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జస్టిస్ బేలా త్రివేది. ఇది ఇంకోసారి జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని విలేఖరిని హెచ్చరించిన ధర్మాసనం.

## పార్కింగ్ స్థలం ఉంటేనే కారు కొనుగోలు

### లేకపోతే నో రిజిస్ట్రేషన్

మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త రూల్



**ముంబై, మహా :** పెరుగుతున్న వాహనాల రద్దీని అరికట్టడానికి కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చింది మహారాష్ట్ర ప్రభుత్వం. కారు కొనుగోలు చేయాలంటే ముందుగా కారు పార్కింగ్ స్థలాన్ని చూపించాలన్న నిబంధనను అమలు చేయాలని భావిస్తోంది. పార్కింగ్ స్థలం ఉన్న వారికి మాత్రమే కార్లు అమ్మాలనే నిబంధనలను అమలులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్. కార్లు కొనుగోలు చేసేటప్పుడు కొనుగోలు దారులు పార్కింగ్ స్థలానికి సంబంధించిన పత్రాలు సమర్పించాలని.. త్వరలో ఈ నిబంధన అమల్లోకి వస్తుందన్నారు. ఈ ప్రతిపాదనపై ప్రజల నుంచి విమర్శలు వచ్చే అవకాశం ఉందంటూ మధ్య తరగతి ప్రజలు కార్లు కొనుగోలు చేయకూడదని తాము చెప్పట్లేదన్నారు. కారు కొనుగోలు చేయాలనుకుంటే అందుకు అనుగుణంగా తగిన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కారు పార్కింగ్ అనేది పెద్ద సమస్యగా మారిందని, అనేఖ చోట్ల రోడ్లపైనా, గల్లీలలో కార్లను పార్క్ చేయడం ద్వారా మిగతా కార్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. అంతే కాకుండా స్థానికులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసమే పార్కింగ్ స్థలం ముందుగా ఏర్పాటు చేసుకుని తర్వాతే కారు కొనుగోలు చేయాలని కోరుతున్నామన్నారు.





## సీఎం అతిషిపై బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

**ఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఢిల్లీలో నేతల విమర్శలు హద్దు మీరుతున్నాయి. ఈ క్రమంలోనే ఢిల్లీ సీఎం అతిషిపై బీజేపీ సీనియర్ నేత రమేష్‌బిధూరి తాజాగా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. నాలుగేళ్లుగా ఢిల్లీ సమస్యలను పట్టించుకోని అతిషి ఎన్నికలు సమీపించిన వేళ ఓట్ల కోసం ఢిల్లీ వీధుల్లో జింకలా పరుగెడుతున్నారని బిదూరి అన్నారు. ఢిల్లీ ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. నగరంలో వీధుల పరిస్థితి చూస్తే ఈ విషయం అర్థమవుతుందన్నారు. గడిచిన నాలుగేళ్లలో అతిషి ఎప్పుడూ ఈ సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ అడవిలో జింకలా ఢిల్లీ వీధుల్లో ఆమె తిరుగుతున్నారని బిదూరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అతిషి మర్లెనా తన తండ్రిని మార్చి అతిషి సింగ్‌గా మారిందని గత వారం కూడా బిదూరి అతిషిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా, రాజకీయ ప్రత్యర్థులపై వివాదాస్పద కామెంట్లు చేయడం బిదూరికి సర్వసాధారణమైపోయింది. బీఎస్పీ నేత డానిష్ అలీని దూషించడం మొదలు.. ఎంపీ ప్రియాంకా గాంధీపైనా వ్యాఖ్యలు చేసి వివాదానికి కారణమయ్యారు. దీనిపై బీజేపీ అధిష్టానం ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరిగింది. ఢిల్లీ ఎన్నికల్లో కల్కాజి నియోజకవర్గంలో సీఎం అతిషిపై బీజేపీ తరపున బిదూరి పోటీ చేస్తుండడం గమనార్హం.



### విదేశీ మహిళ ఒడిలో గణేశుడు..

## బ్యూటీ ఆఫ్ సనాతన్

దేశంలో ఎవరిని కదిపినా, ఎక్కడ చూసినా కుంభమేళాకు సంబంధించిన సంగతులే వినిపిస్తున్నాయి. అలాగే మహా కుంభమేళాకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా విదేశీ భక్తుల ఫోటోలు, వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి. వీటిలో ఒక విదేశీ మహిళా భక్తురాలి ఫోటో అందరినీ ఆకట్టుకుంటోంది. వైరల్ అవుతున్న ఈ ఫోటోలో ఒక విదేశీ మహిళ శాలువా కప్పుకుని, తన చేతులతో గణేశుని విగ్రహాన్ని పొదివి పట్టుకుంది. ఫొటోను చూడగానే గణేశునికి అమ్మప్రేమ అందిస్తున్న మాతృమూర్తిలా ఆమె కనిపిస్తోంది. ఈ ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లోని sarcasticschool_ అనే ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటో కింద '2025 మహాకుంభ్‌లో గణేశుడి విగ్రహంతో విదేశీ మహిళ' అని ఉంది. ఈ ఫొటోను చూసిన ఒక యూజర్ కామెంట్ బాక్స్‌లో 'బ్యూటీ ఆఫ్ సనాతన్' అని రాశారు.




## రజినీకాంత్ జైలర్ 2 టీజర్ రిలీజ్

కోలీవుడ్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం జైలర్. రజనీకాంత్‌కి చాలా రోజుల తర్వాత ఒక కమర్శియల్ బ్లాక్‌బస్టర్‌ని అందించింది ఈ చిత్రం. అయితే ఈ సినిమాకి సీక్వెల్ తీయబోతున్నట్లు దర్శకుడు నెల్సన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ప్రీ ప్రోడక్షన్ పనులు కూడా పూర్తయినట్లు తెలుస్తుంది. ఇదిలావుంటే ఈ సినిమా నుంచి పొంగల్ కానుకగా.. అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. హుకుం సాంగ్‌తో సాంగ్‌తో స్టార్ట్ అయిన ఈ టీజర్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ టీజర్‌ను మీరూ చూసేయండి.

## 90స్ మిడిల్ క్లాస్ బయోపిక్‌కి సీక్వెల్




గత ఏడాది #90స్ ఏ మిడిల్ క్లాస్ బయోపిక్ అనే వెబ్ సిరీస్‌తో వచ్చి సూపర్ హిట్ అందుకున్నాడు దర్శకుడు ఆదిత్య హాసన్ టాలీవుడ్ నటుడు శివాజీ కీలక పాత్రలో నటించిన ఈ సిరీస్‌లో వాసంతిక, రోహన్, స్నేహల్ కామత్ కీలక పాత్రల్లో నటించారు. ఈటీవీ విన్‌లో విడుదలైన ఈ సిరీస్ సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ వెబ్ సిరీస్ అనంతరం దర్శకుడు ఆదిత్య హాసన్ ఆనంద్ దేవరకొండతో ఒక సినిమా చేయబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. లవ్ స్టోరీ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా రానుండగా.. సితార ఎంటర్‌టైనమెంట్స్, ఫోర్చున్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌లపై నాగవంశీ ఈ సినిమాను నిర్మించబోతున్నాడు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌ను సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియోను సంక్రాంతి పండుగ కానుకగా పంచుకున్నారు మేకర్స్. ప్రోడక్షన్ 32 అంటూ వస్తున్న ఈ చిత్రం #90స్ ఏ మిడిల్ క్లాస్ బయోపిక్ సీక్వెల్‌గా రాబోతుంది. ఇందులో శివాజీ చిన్నకొడుకు పాత్రలో ఆనంద్ దేవరకొండ కనిపించబోతున్నాడు. బేబీ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న వైష్ణవి చైతన్య ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది. లవ్ స్టోరీ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు దర్శకుడు ఆదిత్య హసన్ ప్రకటించాడు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ వీడియోను మీరు కూడా చూసేయండి.



## మోహన్‌బాబు వర్సిటీ వద్ద ఉద్రిక్తత.. మంచు మనోజ్‌కు నో ఎంట్రీ


**ఏపీ :** ప్రముఖ నటుడు మోహన్‌బాబు రెండో తనయుడు మంచు మనోజ్ బుధవారం తిరుపతిలోని మోహన్‌బాబు వర్సిటీకి భార్య మౌనికతో కలిసి చేరుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి సతీసమేతంగా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మనోజ్ దంపతులకు ఆయన అభిమానులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం అభిమానులతో కలిసి ఊరేగింపుగా మోహన్‌బాబు వర్సిటీకి బయలుదేరారు. వర్సిటీకి మంచు మనోజ్ వస్తున్నారన్న సమాచారంతో ఎలాంటి ఘటనలు జరుగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. వర్సిటీకి చేరుకున్న మనోజ్‌కు పోలీసులు అడ్డుకున్నారు. కోర్టు ఆదేశాలు ఉన్నందున లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదని చెప్పడంతో మనోజ్ వెనుదిరిగి నేరుగా నారావారిపల్లెకు చేరుకున్నారు. అక్కడ భార్య మౌనికతో కలిసి మంత్రి లోకేష్‌తో సమావేశమయ్యారు. మంత్రితో ఏం చర్చించారన్న వివరాలు ఇంకా తెలియరాలేదు. గత కొన్ని రోజులుగా మంచు కుటుంబంలో వివాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే.

## అన్న ఎప్పుడొస్తే అప్పుడే పండుగ



మారుతి డైరెక్షన్‌లో గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంపౌండ్ నుంచి వస్తోన్న సినిమా రాజాసాబ్. హారర్ కామెడీ జోనర్‌లో వస్తున్న రాజాసాబ్‌లో మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించగా.. సినిమా వాయిదా పడనుందంటూ నెట్టింట వార్తలు హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ పుకార్లపై రాజాసాబ్ టీం పరోక్షంగా హింట్ ఇచ్చేసినట్టేనని అర్థమవుతోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో సినిమా అప్‌డేట్స్ గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రభాస్ టీం సంక్రాంతి శుభాకాంక్షలతో దాదాపు క్లారిటీ ఇచ్చేసింది. డార్లింగ్స్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు.. మనం ఎపుడు వస్తే అప్పుడే అసలైన పండగ. త్వరలో చితక్కొట్టేద్దాం. రాజాసాబ్ త్వరలోనే థియేటర్లలో మిమ్మల్ని కలుస్తాడు.. విడుదల చేసిన పోస్టర్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. ఈ పోస్టర్‌లో విడుదల తేదీని చూపించకపోవడంతో సినిమా పాత తేదీన రావడం లేదని క్లారిటీ వచ్చేసినట్టైంది. మరి రాజాసాబ్ ఎప్పుడొస్తాడో.. అభిమానులకు పండుగ ఎప్పుడుంటుందోనని ఆసక్తికంగా మారింది.

## విజయ్ దేవరకొండతో సెల్ఫీ దిగిన టీమ్‌ఇండియా యువ క్రికెటర్..



రౌడి బాయ్ విజయ్ దేవరకొండతో టీమ్ ఇండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ సెల్ఫీ దిగాడు. వీరిద్దరి కలిసి ఒకే ఫ్లైట్‌లో ప్రయాణిస్తుండగా.. విజయ్‌ని చూసిన తిలక్ వర్మ అతడితో కలిసి సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. మిమ్మల్ని ఫ్లైట్‌లో కలుసుకోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది అన్న. మిమ్మల్ని కలుసుకోవడం నా అదృష్టం. మళ్లీ కలుద్దాం. అంటూ తిలక్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకోచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్‌గా మారింది. విజయ్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం జెర్సీ దర్శకుడు గౌతమ్ తిన్నూరితో కలిసి వీడి 12 అనే ప్రాజెక్ట్ చేస్తున్నాడు. యాక్షన్ & స్పై బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నాడు. తిలక్ విషయానికి వస్తే.. గత ఏడాది నవంబర్‌లో జరిగిన దక్షిణాఫ్రికా పర్యటనలో అదరగొట్టాడు. నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 31తో కైవసం చేసుకోవడంలో తిలక్ కీలక పాత్ర పోషించాడు. మరోవైపు జనవరి 22 నుంచి భారత జట్టు ఇంగ్లాండ్‌తో 5 మ్యాచుల టీ20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు తిలక్ వర్మ ఎంపిక అయ్యాడు.


# క్రీడా వార్తలు SPORTS NEWS



## బయట అనుకునేవన్నీ నిజాలు కావు

### రిటైర్‌మెంట్‌పై భారత బౌలర్ అశ్విన్

భారత స్టార్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ ఆస్ట్రేలియా టూర్‌లో అనూహ్యంగా రిటైర్‌మెంట్ ప్రకటించి అందరికీ షాకిచ్చాడు. అయితే ఆయనకు అవమానం జరగడంవల్లే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. మాజీ క్రికెటర్‌లు, క్రికెట్ విశ్లేషకులు కూడా నెట్టింట తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఫేర్‌వెల్ టెస్టు ఆడితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో వీటన్నింటిపై అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా స్పందించాడు. తన రిటైర్‌మెంట్ గురించి బయట అనుకొనేవన్నీ నిజాలు కాదని, ప్రస్తుత రోజుల్లో ఫ్యాన్ వార్ అనేది ఓ రేంజ్‌లో ఉందని వ్యాఖ్యానించాడు. తాను బ్రేక్ కావాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నానని, అందుకే ఈ సిరీస్ మధ్యలోనే బయటకి వచ్చేశానని చెప్పారు. తన రిటైర్‌మెంట్ ప్రకటన గురించి బయట రకరకాలుగా మాట్లాడుకుంటున్నారని, అందులో ఎలాంటి వాస్తవాలు లేవని అన్నారు. ఫేర్‌వెల్ మ్యాచ్ ఆడితే బాగుండునన్న మాజీల అభిప్రాయాలపై కూడా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా ఇలాంటి ఫేర్‌వెల్ మ్యాచ్‌లకు తాను అంతగా ఇంపార్టెన్స్ ఇవ్వనని, అదేమంత ముఖ్యమైన విషయం కాదని అన్నాడు. ఒకవేళ నాకు అలాంటి ఛాన్స్ ఇవ్వాలని స్క్వాడ్‌లోకి తీసుకొని, తర్వాత సమీకరణాల కోసం తుది జట్టు నుంచి తొలగిస్తూ సంతోషంగా ఉండగలనా అని అశ్విన్ ప్రశ్నించాడు. అభిమానుల నోట ఈయన ఇంకా ఎందుకు..? అనే మాట రాకముందే ఆటకు ముగింపు పలకడం మంచిదనుకున్నానని ఆయన చెప్పాడు.



## ఫెదరర్ రికార్డును బ్రేక్ చేసిన జోకోవిచ్

**మెల్‌బోర్న్:** టెన్నిస్ స్టార్ నోవాక్ జోకోవిచ్కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. ఓపెన్ ఎరాలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ మ్యాచ్‌లు ఆడిన ఘనతను జోకోవిచ్ దక్కించుకున్నాడు. ఇప్పటి వరకు రోజర్ ఫెదరర్ పేరిట ఉన్న రికార్డును అతను బ్రేక్ చేశాడు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో మూడవ రౌండ్‌లోకి ప్రవేశించిన జోకోవిచ్ ఈ కొత్త మైలురాయి చేరుకున్నాడు. గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీల్లో ఇప్పటి వరకు జోకోవిచ్ 430 మ్యాచ్‌లను గెలుచుకున్నాడు. ఆ జాబితాలో రోజర్ ఫెదరర్ 429 మ్యాచ్‌లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఆల్‌టైం రికార్డును బ్రేక్ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు జోకోవిచ్ చెప్పాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన జోకోవిచ్.. ప్రస్తుతం ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో దూసుకెళ్తున్నాడు. టెన్నిస్‌ను ప్రేమిస్తాను, పోటీలను ప్రేమిస్తాను, ప్రతిసారి బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తాను, 20 ఏళ్లుగా గ్రాండ్‌స్లామ్ పోటీల్లో ఆడుతున్నానని, ఓడినా..గెలిచినా.. పూర్తిగా ఆటను ఆస్వాదిస్తానన్నాడు.

## ఆ ఇద్దరి ఫిట్‌నెస్‌పై ఆందోళన

### ఐసీసీ ఛాంపియన్ ట్రోఫీ జట్టు ప్రకటన ఆలస్యం!



**ముంబై :** వచ్చే నెల మొదలుకానున్న ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం ఇప్పటికే అన్ని దేశాలూ తమ ప్రాథమిక జట్లను ప్రకటించాయి. కానీ బీసీసీఐ మాత్రం గడువు తేదీ (జనవరి 12) ముగిసినా జట్టును ప్రకటించకపోగా తమకు మరికొంత సమయం కావాలని ఐసీసీని కోరింది. ఈనెల 18 లేదా 19న భారత జట్టును ప్రకటించే అవకాశముంది. అయితే ప్రధానంగా భారత ఏస్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఫిట్‌నెస్ గురించి స్పష్టమైన అవగాహన లేకపోవడంతోనే జట్టు ప్రకటన ఆలస్యమవుతోందని తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో చివరి టెస్టులో వెన్ను నొప్పితో గాయపడ్డ బుమ్రా.. చాంపియన్స్ ట్రోఫీ నాటికి పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధిస్తాడా? లేదా? అన్నది స్పష్టత లేదు. ఇక గతేడాది స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న కుల్‌దీప్ ప్రస్తుతం ఎన్‌సీఏలో పునరావాసం పొందుతున్నాడు. త్వరలోనే వీళ్ల ఫిట్‌నెస్ రిపోర్ట్ రానుందని, అది వచ్చిన వెంటనే జట్టును ప్రకటిస్తారని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

## ఖోఖో ప్రపంచకప్‌లో భారత్ బోణీ.. నేపాల్‌పై ఘన విజయం

**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ ఆతిథ్యమిస్తున్న మొదటి ఖోఖో ప్రపంచ కప్ పోటీలు సోమవారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియం వేదికగా ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్ కాగడాను వెలిగించి ఈ పోటీలను అధికారికంగా ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య భారత్.. ఉత్కంఠభరితంగా జరిగిన పోరులో ఐదు పాయింట్ల తేడాతో నేపాల్‌ను ఓడించి బోణీ కొట్టింది. మ్యాచ్‌లో భారత్ 42 పాయింట్లు సాధించగా నేపాల్ 37 పాయింట్లకే పరిమితమైంది.

ఆసాంతం ప్రేక్షకులను మునివేళ్లపై కూర్చోబెట్టిన పోరులో భారత్ మధ్యలో తడబడ్డా తర్వాత పుంజుకుని తొలి విజయాన్ని నమోదుచేసింది. నాలుగు టర్న్‌లు (ఒక్కో టర్న్ ఏడు నిమిషాలు)గా జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట అటాకింగ్‌ను ఎంచుకున్న భారత్.. మొదటి టర్న్‌లో నేపాల్ నాలుగు బ్యాచ్ (ఒక్కో బ్యాచ్‌లో ముగ్గురు)లను ఆలౌట్ చేసి 24 పాయింట్లు రాబట్టింది. అనంతరం నేపాల్.. అటాకింగ్‌లో 18 పాయింట్లే సాధించింది. రెండో టర్న్‌లో నేపాల్ కాస్త పుంజుకుని తమను తాము అద్భుతంగా డిఫెండ్ చేసుకుంది. దీంతో భారత్ 18 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. కీలకమైన నాలుగో టర్న్‌లో నేపాల్.. 21 పాయింట్లు సాధించాల్సి ఉండగా నేపాలీలు 17 పాయింట్లే దక్కించుకోవడంతో భారత్ విజయఢంకా మోగించింది.

ఈ పోటీల ఆరంభానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు అభిమానులను అలరించాయి. సుమారు గంటన్నర పాటు సాగిన ఈ వేడుకలలో భారతీయత ఉట్టిపడేలా కళాకారులు ప్రదర్శనలిచ్చారు. కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ, ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా.. అంతర్జాతీయ, భారత ఖోఖో సమాఖ్య అధ్యక్షుడు సుదాన్షు మిట్టల్‌తో పాటు పలువురు రాజకీయ, క్రీడా ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com